నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
1
గురువారం | సెప్టెంబర్ 07 2023 | www.navatelangana.com

పారిశుధ్య లోపం ప్రజలకు శాపం



నవ తెలంగాణ టేక్మాల్

రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి పల్లెలను ప్రగతి పథంలో ముందు ఉంచాలన్న ఉద్దేశంతో పారిశుద్ధ పనులను చేపట్టి పల్లెలను అగ్రగామిగా నిలపాలున్నదే ప్రభుత్వ లక్ష్యం. దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించని చందంగా సంబంధిత అధికారులు పాలకులు నిర్లక్ష్య కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు తిష్ఠ వేస్తున్నాయి. మండల పరిధిలోని కాదులూరు గ్రామాన్ని గత నెల 17వ తేదీన అదరపు కలెక్టర్ రమేష్ సందర్శించారు. గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధపరులు అస్తవ్యస్తంగా ఉన్నాయని తెలుసుకొని వెంటనే పనులు చేయాలని అలాగే గ్రామంలో మొక్కలు నాటాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నేటి వరకూ మొక్కలు నాటలేదు. పారిశుద్ధ పనులు చేపట్టలేదు ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పక తప్పదేమో. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మండల పరిధిలోని అన్ని గ్రామాలలో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు

గమ్యం చేరే వరకు మద్యం సేవించొద్దు



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

వాహనదారులు గమ్యస్థానాలకు చేరేంతవరకు మార్గమధ్యంలో మద్యం సేవించొద్దని హుస్నాబాద్ సిఐ ఎర్రల్ల కిరణ్ అన్నారు. బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారికి హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే కుటుంబం వీధిన పడుతుందని అన్నారు.భార్యా పిల్లలు కుటుంబం గురించి ఆలోచించి బాధ్యతగా నడుచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజల రక్షణ కోసం రోడ్డు ప్రమాదాల నివారణ పై ప్రతిరోజు వాహనాల తనిఖీ జరుగుతుందన్నారు. ఫైన్ లు వేయడం కోర్టుకు పంపడం మా అభిమతం కాదని, ప్రజలలో మార్పు కోసం అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎస్ఐ మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ దుబ్బాక దుబ్బాక రూరల్

దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది కార్యకర్తలు గన్నెబోయిన రాము గౌడ్, ఈశ్వరయ్య, బొమ్మ లచ్చయ్య, కండ్ల కొయ్య సత్యనారాయణ, గుండెల్లి మల్లయ్య, మండల యాదగిరి, కండ్ల కొయ్య కరుణాకర్, మండల చంద్రయ్య, కండ్లకోయ సత్తయ్య, కంచర్ల పరుశరాములు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికీ తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కత్తి కార్తీక మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్,బీజేపీ అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతు అవ్వడం ఖాయమని అన్నారు. తొమ్మిదేళ్ళ బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసుగు చెందుతున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు .ఈ కార్యక్రమంలో కొత్త దేవి రెడ్డి (బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ దుబ్బాక), రంగనబోయిన దేవస్వామి(ఓబీసీ సెల్ మండల్ అధ్యక్షుడు, దుబ్బాక),"టిపిసిసి మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ" కర్నల్ శ్రీనివాసరావు,ఐరేని సాయితేజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పైనుంచి వెళ్తున్న వర్షపు నీరు



నవ తెలంగాణ - దౌల్తాబాద్

వర్షాకాలం వస్తుందంటేనే సిద్దిపేట వెళ్లే ప్రయాణికులకు గుండెల్లో గుబులు పుట్టాల్సిందే. మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి మండల పరిధిలోని లింగరాజుపల్లి, సూరంపల్లి, ముత్యంపేట, దొమ్మాట, గాజులపల్లి, మిరుదొడ్డి, తొగుట మండలాల ప్రజలు ప్రతిరోజు దౌల్తాబాద్ పట్టణానికి వచ్చి పోయే రైతులకు, ప్రభుత్వ ప్రైవేటు శాఖలలో విధులు నిర్వహిస్తున్న ప్రయాణికులకు ప్రతిసారి దొమ్మాట వాగు రోడ్డు పైనుంచి వర్షపు నీరు వెళుతుంటే ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో పలుసార్లు ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్న ఫలితం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరమైనా వంతెనను ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరారు.

కూడవెల్లి వాగులో భారీగా చేపలు



నవతెలంగాణ-తొగుట

వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో కూడవెల్లివాగు పొంగి ప్రవహిస్తోంది. బుధవారం అల్ప పీడన ప్రభావంతో మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిం దే. వాగు ప్రవాహంలో చేపలు వస్తుండటంతో చందాపూర్ వద్ద మత్స్యకారులు చేపలు పడుతున్నారు.ఒక్కో చేప 6 కిలోల వరకు ఉండటంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డు నర్సింలు మాట్లాడుతూ గతంలో కూడవెల్లి వాగు కరువు,కాటకాలతో ఎండి పోతుండేది.అందువల్ల మత్స్యకారులకు చేపలు దొరికెవి కాదు.గత మూడేళ్ళుగా మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేయడం వల్ల వాగులోకి నీటిని విడుదల చేస్తున్నారు.తద్వారా కూడవెల్లి వాగు జీవనదిగా మారిందని తెలిపారు. దీంతో వాగులో చేపలు పెద్ద ఎత్తున వృద్ధి చెందుతున్నా యని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు



నవతెలంగాణ-నంగునూరు

సమాజంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని, సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయుల సేవలు అమోఘమని తపస్ నంగునూరు మండల శాఖ అధ్యక్షులు పయ్యావుల జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన నంగునూరు మండలంలోని జే.పీ తండాకు చెందిన ఉపాధ్యాయుడు చంద్రంకి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)తరపున బుధవారం సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తపస్ నంగునూరు మండల శాఖ అధ్యక్షులు జైపాల్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి చంద్రం చేస్తున్న సేవలు వెలకట్టలేని వారు చేసిన సేవలకు గుర్తింపు లభించడం చాలా ఆనందదాయకంగా ఉందని పేర్కొన్నారు. చంద్రంకి ఈ అవార్డు రావడం వెనుక వారి మాతృమూర్తి, ధర్మపత్ని సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంగ నర్సిరెడ్డి, క్యాతం మహేందర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా తపస్ ఉపాధ్యక్షుడు గడీల శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాం రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాములు, వీరేశం, రాజేశ్వర్ రెడ్డి, సుధాకర్ రావు, బాలకిషన్, అర్జున్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై అవగాహన



నవతెలంగాణ వర్గల్

మండలంలోని పలు గ్రామాలలోని ప్రజలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ పై అవగాహన కార్యమాన్ని నిర్వహించినట్లు వర్గల్ మండల తహశీల్దార్ హరి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రతిఒక్కరు ఎలక్ట్రానిక్ ఓటింగ్ పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి,యువకులు, ఓటు హక్కు కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు నమోదుకై సెప్టెంబర్ 19 చివరి తేదీ అని తెలిపారు.

ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ మద్దూరు

మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన సైదేశ్వరరావుకు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి రూ.2.50 లక్షల ఎల్ ఓసి ని అందజేశారు. సైదేశ్వర రావు ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం చేరడంతో అతని వైద్య చికిత్స కోసం జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఎల్ ఓ సి ని అందించి ఆదుకొని మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మద్దూరు బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం ,దూల్మిట్ట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి , బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బర్మా రాజ మల్లయ్య , తదితరులు పాల్గొన్నారు

వర్షాలతో పంటలకు ప్రాణం



- ఆరుబట్టే వేళ ఆదుకున్న వర్షాలు
- పత్తి, కంది, ఇతర మెట్ట పంటలకు ఆసరా
- తెగుళ్ల బారిన పడకుండా సస్య రక్షణ చర్యలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరు వానలు
- కాస్త గరువు ఇవ్వడంతో పైర్లకు ఊరట





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వర్షాభావంతో ఒట్టిపోయే దశలో కురిసిన వర్షాలతో మెట్ట పంటలకు ప్రాణం వచ్చినట్లైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిశాయి. వర్షపు నీరు చేరడంతో కాల్వలు, వాగులు, చెర్వులు, కుంటలు ఉప్పొంగాయి. జలాశయాలకు జల కళ సంతరించుకుంది. మరో పక్క ఆరుతడి, మెట్ట పంటలకు ఇటీవల కురిసన వర్షాలు ఎంతో మేలు చేశాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగైన మెట్ట పంటలు నీటి ఎద్దడితో వాడుబడుతున్న సమయంలో వర్షాలు కురియడంతో పైర్లకు ఊరట లభించింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షం

మూడు రోజుల పాటు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. ఈ నెల 3, 4, 5, 6 తేదీలలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురియడంతో లోతట్టు ప్రాంతాల్లో వరదలు ఉప్పొంగాయి. తగ్గిన చెర్వులు, కుంటల నీటి మట్టం ఈ వర్షాలతో తిరిగి నీటి మట్టం పెరిగింది. చాలా చోట్ల చెర్వులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 28 మండలాల్లోనూ వర్షాలు కురిశాయి. బుధవారం గుమ్మడిదల మండలంలో 40.6, జిన్నారంలో 31.6, ఆర్‌సీపురంలో 27.6, హత్నూర 25.2, నిజాంపేటలో 21.3, అమీన్‌పూర్‌లో 19, పటాన్‌చెరులో 16.6, అందోల్ 22.5, పుల్కల్ 19.7, సదాశివపేటలో 14.4, వట్‌పల్లిలో 11, సంగారెడ్డిలో 18.2, కల్హేర్‌లో 19.4 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 2 నుంచి 10 మిల్లీ మీటర్ల వరకు వర్షాపాతం నమోదైంది. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోని అన్ని మండలాల్లో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిశాయి. సగటు వర్షాపాతం 13.2 మిల్లీ మీటర్ల చొప్పున నమోదైంది.

పైర్లకు ప్రాణం పోసిన వానలు

ఖరీఫ్ సీజన్ పంటల సాగు ఆగస్టు మొదటి వారంలోనే పూర్తయ్యాయి. ఆగస్టు చివరి నాటికి వరి పైర్లు కలుపుతీత సమయానికి వచ్చాయి. ఈ సమయంలో నీటి వినియోగం బాగా పెరిగింది. దీంతో కాల్వలకు నీటిని విడుదల చేయడం, వ్యవసాయ మోటర్లు ఎక్కువ సమయం నడవడంతో చెర్వులు, బోర్లు, బావుల నీటి మట్టం తగ్గింది. ఎండల తీవ్రత కూడా పెరిగింది. వర్షాభావ పరిస్థితులేర్పడడంతో పైర్లకు నీటి ఎద్దడి సమస్య తలెత్తింది. పత్తిపైర్లు నీటి ఎద్దడి వల్ల పూత రాలిపోయింది. పిందలు ఒట్టిపోయి రాలిపోయాయి. కంది, పెసర, ఉల్లి, మొక్కజొన్న, జొన్న వంటి ఇతర పంటలకు కూడా నీటి సమస్య తలెత్తింది. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో వరి పైర్లు కూడా కలుపుతీత, ఎరువులు వాడకంతోపైర్లు ఏపుగా పెరిగాయి. పైర్లు పెరిగే దశలో నీటి సమస్య వచ్చింది. వర్షాధారంగా నాట్లు వేసిన పొలాల్లో నీళు లేక వరి పైర్లు వాడుపట్టే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సమయంలో వర్షం కోసం ఎదురు చూస్తున్న వేళ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. నాలుగు రోజుల పాటు భారీగా వర్షాలు కురియడంతో పైర్లకు ప్రాణం పోసినట్లైంది. పత్తి, చెరకు, కంది, మొక్కజొన్న, వరి పైర్లతో పాటు జామ, సపోట, ఆలు, ఉల్లిగడ్డ వంటి పంటలకు వర్షాలు ఉపయోగపడ్డాయి.

సస్య రక్షణ చర్యలు: నర్సింహ్మారావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఇటీవల కురుస్తున్న వర్షాలు పైర్లకు ఉపయోగపడ్డాయి. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో ఆరుతడి పంటలకు నీటి ఎద్దడి ఏర్పడింది. వర్షాలు పడినందున నీటి ఎద్దడి సమస్య తీరింది. అధిక వర్షాలకు తెగుళ్లు సోకే అవకాశముంది. లోతట్టు ప్రాంతాల్లో మునిగిన పైర్లు కూడా దెబ్బతింటాయి. రైతులు పైర్లకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా పైర్లను కాపాడుకోవాలి.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయండి.. మీ వెంట మేముంటాం

- ఐలమ్మ స్ఫూర్తితో మా సామాజిక వర్గం మొత్తం కదిలి.. నీలం మధును గెలిపించుకుంటాం
- రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి చాకలి వెంకటేష్
- ఇస్నాపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు ఎమ్మెల్యే స్వతంత్రభ్యర్థిగా నీలం మధు పోటి చేయాలని.. ఆయన వెంట మేముంటాం అని రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి చాకలి వెంకటేష్ భరోసా ఇచ్చారు. మండలంలోని చిట్కుల్లో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అక్కడి నుంచి ఇస్నాపూర్ చౌరస్తాకు ర్యాలీగా వచ్చి జాతీయ పై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం బాలాజీ ఫంక్షన్ హాల్‌లో రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి చాకలి వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి రజకుల ఐక్యవేదిక సమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తటిలో అవకాశం కోల్పోయిన నీలం మధు ముదిరాజ్‌కు సబ్బండ వర్గాల ప్రజల మద్దతు రోజు రోజుకు పెరుగుతుందన్నారు. నీలం మధు కు మద్దతుగా అన్ని బీసీ వర్గాలు ఏకమవుతున్నాయని.. ఐక్యమత్యంతో ముందుకు సాగి నీలంను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే టికెట్ నీలంకు కేటాయిస్తే గెలిపించి మీ చేతిలో పెడతామంటూ భరోసా ఇస్తున్నామన్నారు. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేద్దామని మా అందరి మద్దతు మీకే ఉంటుందని తేల్చి చెప్పారు. నీలం మధుకు తోడుగా పటాన్ చెరు నియోజకవర్గ మెజారిటీ రజక సంఘలు ఎమ్మెల్యే అభ్యర్థిగా నీలం మధు ముదిరాజ్ కి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో తమ సామాజిక వర్గం అంతా కదిలి నీలం మధును ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని చెప్పారు. పటాన్ చెరు నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అతి పెద్దదైన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి తమకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన నీలం మధు బాటలోనే మేమంతా పయనిస్తామని రజకులు వెల్లడించారు. టికెట్ల కేటాయింపులో కేసీఆర్ బీసీ వర్గాలను మోసం చేశాడని ఆరోపించారు. రాష్ట్రంలో 30 లక్షల మంది ఉన్న రజకులకు ఒక టికెట్టు కూడా కేటాయించకపోవడం తప్పు పట్టారు.పటాన్ చెరు నియోజకవర్గంలో మెజారిటీ బీసీలున్నారని దానికి తోడు సబ్బండ వర్గాల పక్షాన నీలం మధు ముదిరాజ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నమ్ముకున్న ప్రతి ఒక్కరికి అండగా నిలబడుతున్నారన్నారు. అటు మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుతూ వారి గాథలను భవిష్యత్తు తరాలకు తెలియజేసే ఉద్దేశంతో వారి పోరాటాన్ని గుర్తుచేసేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పునరాలోచించుకొని పటాన్ చెరు ఎమ్మెల్యే టికెట్ నీలం మధు ముదిరాజ్ కు కేటాయించాలని డిమాండ్ చేశారు. నీలంకు టికెట్ ఇస్తే అన్ని వర్గాల ప్రజలు ఐక్యమత్యంతో ముందుకు సాగి భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించుకొని తమ ముందుకు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. లేని పక్షంలో పోరాటం తమకు కొత్త కాదని చాకలి ఐలమ్మ వారసులుగా తమ వర్గం అంతా నీలం మధు పక్షాన నిలబడి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయించి ఎమ్మెల్యేగా గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు మండల అధ్యక్షులు గణేష్, గుమ్మడిదల మండల అధ్యక్షులు వీరెష్,అమీన్పూర్ మండలాధ్యక్షులు నాగేష్, రామచంద్రపురం మండల అధ్యక్షులు నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య,లక్ష్మణ్, ఆశయ్య,రవి, సందీప్, గోపాల్, నారాయణ, సురేశ్,బాలకష్ణ, రజక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దానధర్మాలలో పోటీ పడుతున్న రాజకీయ నాయకులు





నవతెలంగాణ- నిజాంపేట

నిరుపేదలు మండలంలో మరణించినట్లయితే వారి కుటుంబాలను ఆదుకోవడానికి రాజకీయ నాయకులు పోటీలు పడుతున్నారు. నిరుపేదల ఆడపిల్లల పెళ్లిళ్లకు పుస్తె మట్టెలను, ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు. నిజాంపేట మండలంలో ఏ గ్రామంలో ఎవరైనా చనిపోయినట్లయితే వెంటనే వారి కుటుంబానికి రాజకీయ నాయకులు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. ఇటువంటి సౌకర్యం ఏ మండలంలో కనిపించడం లేదు. కానీ నిజాంపేట మండలంలో ఇలాంటి సదుపాయాలు రాజకీయ నాయకులు కల్పిస్తున్నారు. నిత్యావసర సరుకులు కానీ ఆర్థిక సహాయం గాని వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. ఇది ఎలక్షన్ల వరకు కాకుండా ఎప్పటికీ కొనసాగించినట్లయితే ఎంతో బాగుంటుందంటున్నారు. చనిపోయిన కుటుంబం రోడ్డు పాలు కాకుండా కుటుంబానికి అండగా నిలుస్తున్నారు .ఒకప్పుడు ఎవరైనా చనిపోతే వారి దహన సంస్కారాలకు ఎంతో ఇబ్బంది ఏర్పడేది. ఏమైనా నగలు ఉంటే కుదువబెట్టి డబ్బులు తీసుకొచ్చి దహన సంస్కారాలు చేసేవారు. లేదా ఎవరైనా బంధువులు అప్పుగా ఇచ్చేవారు. ప్రస్తుతము అటువంటి పరిస్థితి లేదు. ఏదిఏమైనాప్పటికీ రాజకీయ నాయకులు పోటీపడి దానధర్మాలు చేయడం హర్షించదగ్గ విషయమే అంటూ మండలంలో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మూడోసారి కేసీఆర్ సీఎం కావాలని ముడుపు



నవతెలంగాణ-మర్కూక్

రానున్న ఎలక్షన్లలో హాట్రిక్ సాధించి మూడోసారి కేసీఆర్ సీఎం కావాలని కోరుతూ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామికి ముడుపులు కాట్టేందు వెళ్లారు. బుధవారం మండలంలోని సిఎం దత్తత గ్రామమైన ఎర్రవల్లి గ్రామం నుంచి సర్పంచ్ మొండి బాగ్యబిక్షపతి, ఎంపీటీసి తుమ్మ ధనలక్ష్మి కృష్ణ, మాజీ సర్పంచ్, జగదేవపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కమ్మరి బాలరాజు, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు వెంకట్ రెడ్డి, గ్రామ యువకుల ఆధ్వర్యంలో 100 మంది పాదయా త్రగా వెళ్లారు. ఉదయం గ్రామం నుండే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం గ్రామంలో గల మర్రి బావి హనుమాన్ దేవాలయం, ఏడుపాయల దుర్గమ్మ,పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం,నాగపురి మైసమ్మ, పోశమ్మ,గడిమైసమ్మ,తదితర గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ వంటేరు యాదవ,ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి,మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్, జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్ లు జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించారు. వరదరాజ్ పూర్, దామరకుంట, కాశిరెడ్డిపల్లి,గ్రామాల మీదుగా 40 కిలోమీటర్ల బుధవారం రాత్రి చేరుకుని యాదాద్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, ముడుపులు కట్టనున్నట్లు తెలిపారు. ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మార్గ మధ్యలో ఇబ్రహీంపూర్ వద్ద పాదయాత్రలో పాల్గొని సంఘీబావం తెలిపారు. ఈ పాదయాత్ర లో ఉపసర్పంచ్ కనకయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు గీసు మల్లేశం, నాయకులు శ్రీశైలం యాదవ్,బాబు యాదవ్,సంగ నవీన్, పరుశురాం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులున్నారు.

సంక్షోభంలో విద్యా రంగం

- ఖాళీల భర్తీ పట్టని పాలకులు
- స్కాలర్‌షిప్స్, రియంబర్స్‌మెంట్ రాక తిప్పలు
- రేపటి నుంచి రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు
- భవిష్యత్ కర్తవ్యాల చర్చ, నిర్ణయాలు
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని ఎస్ ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి విమర్శించారు. బుధవారం సుం దరయ్య భవన్ లో నిర్వహించిన విలే కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా రంగ పరిరక్షణతో పాటు సమ స్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ పోరాటాలు చేస్తుందన్నారు. రాబోయే కాలంలో నిర్వహించే భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకునేందుకు రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపా రు. తొమ్మిదేండ్ల పాలనలో రాష్ట్రంలో పాఠశాల విద్య నుంచి యూనివర్సిటీ విద్య వరకు పూర్తిగా నిర్వీర్యం చేయబడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ ప్రాధాన్యతలు తప్ప విద్యా రంగం సమగ్రభివృద్ధికి కావాల్సిన నిధుల్ని కేటాయించడంతో ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో 24 వేల టీచర్ పోస్టుల్ని భర్తి చేయాల్సి ఉండగా కేవలం 5609 పోస్టుల భర్తీ కోసమే డీఎస్సీని ప్రకటించడం సరైంది కాదన్నారు. రాష్ట్ర యూనివర్సిటీలలో 5552 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గురుకులాలు, కేజీబీవీలలో ఉన్న ఖాళీలను కూడా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందజేయలేదని విమర్శించారు. విద్యార్థులకు కనీస సదుపాయాలు కూడా లేవన్నారు. పెంచిన మెనును అమలు చేయడంలోనూ నిర్లక్ష్యం కొనసాగుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ యాత్రలు నిర్వహించామన్నారు. ఈ యాత్ర ద్వారా రాష్ట్రంలో ఉన్న గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ళు, ప్రభుత్వ స్కూల్స్, కళాశాలల్లోని నెలకొని ఉన్న సమస్యలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. తాగునీరు, ప్రహరీగోడలు, విశ్రాంతిగదులు, ఆట స్థలాలు, సైకిల్ స్టాండ్స్, అద్దె భవనాలు, మూత్ర శాలలు, కంప్యూటర్స్, ల్యాబ్స్, కరెంట్ వంటి అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. మన ఊరు-మన బడి కింద చేపట్టిన పనుల్లో నాణ్యతలేదన్నారు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తుంటే కనీస పర్యవేక్షణలేదన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇంత వరకు అమలు చేయడలేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చే శారు. రాష్ట్రంలో ఉన్న విద్యా రంగ సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాబోయే కాలంలో మరింత సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు సంగారెడ్డిలో నిర్వహించే ప్లీనరీ సమావేశాలు దోహదపడతాయని తెలిపారు. ఈ సమావేశాల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. విద్యార్థి ర్యాలీ, బహిరంగ సభకు జిల్లాలో ఉన్న విద్యార్థులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్, అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్, సహాయ కార్యదర్శి రజనీకాంత్, వాణి, జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, కార్తిక్, రజనీకాంత్ పాల్గొన్నారు.

రైతులందరికీ లక్ష రుణమాఫీ వెంటనే చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రైతులందరికీ లక్ష రుణమాఫీ వెంటనే చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ జేడీఏ నర్సింహరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ.. అసైన్డ్ భూములకు బ్యాంకు రుణాలు ఇవ్వని అధికారుల పై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల రైతు రుణమాఫీని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అందరికీ చేయాలన్నారు. లక్షలోపు రుణం మాఫీ కాక కొంతమంది రైతులు ఆఫీసు ల చుట్టూ తిరుగుతున్నారన్నారు. మరికొంతమందికి టెక్నికల్ సమస్యల ద్వారా రుణ మాఫీ కావట్లేదని.. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి అందరికీ రుణమాఫీ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తిరిగి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. అసైన్డ్ భూములకు కూడా కొత్త రుణాలు ఇచ్చే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు రాజయ్య, కష్ణ, మానిక్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతార్

- 11 మంది ఉపాధ్యాయులకు ఒక్కరే హాజరు
- అక్షయపాత్ర రాక పస్తులున్న విద్యార్థులు





నవతెలంగాణ-వట్‌పల్లి

మండల పరిధిలోని పోతుల బొగుడ మోడల్ పాఠశాలలో 11 మంది లెక్చరర్లు, ఐదుమంది గెస్ట్ ఉపాధ్యా యులు ఉండగా.. బుధవారం ప్రిన్సిపాల్‌తో పాటు పది మంది ఉపాధ్యాయులు విధులకు హాజరవ్వలేదు. కనీసం జిల్లా విద్యాధికారికి కూడా ఇన్ఫర్మేషన్ తెలపకుండా.. ఎలాంటి అనుమతి లేకుండానే తమకు తాముగా ఆప్షనల్ హాలిడే ప్రకటించుకున్నారు. బుధవారం సెలవు దినమని కొంతమంది విద్యార్థులకు తెలియజేసి.. మరికొందరికి తెలియపరచకపో వడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు అయోమయం నెలకొన్నది. ఉదయం ఎనిమిదిన్నర గంటలకు తెరుచు కోవాల్సిన పాఠశాల తలుపులు 10:30 దాటిన తెరుచుకోలేదు. దీంతో పాఠశాలకు వచ్చిన కొందరు విద్యార్థులు గేటు బయటనే నిరీక్షించాల్సి వచ్చింది. పాఠశాలలో 600కు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నప్పటికీ కేవలం పాఠశాలకు వచ్చింది.. 60 నుంచి 70 మంది విద్యార్థుల వరకే చేరుకున్నారు. ప్రిన్సిపాల్ తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతూ జిల్లాస్థాయి అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారి ఆదేశాలతో ఆగ మేఘాల మీద పాఠశాలను తెరిచారు. పాఠశాలలో 11 లో కేవలం ఒక మహిళ లెక్చరర్, పీఈటీ మాత్రమే విధులకు హాజరయ్యారు. దీనికఇతోడు ప్రతినిత్యం విద్యార్థుల కడుపు నింపేందుకు వస్తున్న అక్షయపాత్ర కూడా మధ్యాహ్నం రెండు గంటలు దాటినా రాకపోవడంతో.. విద్యార్థులు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొన్నది. కొందరు ఇంటి నుండి తెచ్చిన టిఫిన్ బాక్స్‌లను వన్ బై టు షేర్ చేసుకుని అర్ధాకలితో కడుపుని నింపుకున్నారు. ఎట్టకేలకు మహిళా లెక్చరర్ విద్యార్థుల ఆకలిని తీర్చేందుకు స్నాక్స్ తెప్పించి పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో మోడల్ పాఠశాలలో విద్య కుంటుపడుతుందని.. ఆమె వైఖరి పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడవిలో పాఠశాల ఉండడంతో సిబ్బంది కూడా ఇష్టారాజ్యాంగ విధులకు వచ్చి పోతుంటారని.. సమయపాలన కూడా పాటించరని ఆరోపిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లా డీఈఓ. డిఐఓ. వెంకటేశ్వర్లు వివరణ

పోతుల బొగుడ శివారులోని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందివారికి వారే ఆప్షనల్ హాలిడే ప్రకటించుకొని విధులకు హాజరు కాకపోవడం సరికాదు. కచ్చితంగా బుధవారం పాఠశాల కొనసాగాల్సిందే. విధులకు హాజరు కాని ప్రిన్సిపాల్, సిబ్బందిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. మెమోలు జారీ చేయడమా లేదంటే మరొక రోజైన ఎక్స్‌ట్రా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
గురువారం | 07 సెప్టెంబర్ 2023 | www.navatelangana.com

మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-సంగారెడ్డి, కొండాపూర్

చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మంత్రి హరీశ్‌రావు నివాసంలో సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ కండువా కప్పి.. పార్టీలోకి మంత్రి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంగారెడ్డిలో గెలిచిన ఎమ్మెల్యే నాలుగున్నర ఏండ్లుగా ప్రజలకు దూరంగా ఉంటూ నియోజకవర్గాన్ని పట్టించుకోకపోయినా.. చింతా ప్రభాకర్ మాత్రం నిరంతరం సంగారెడ్డి అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారని కితాబ్ ఇచ్చారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో కాంగ్రెస్ పార్టీ కొండాపూర్ మండలాధ్యక్షులు ఇంద్రారెడ్డి, సర్పంచ్ అంకుషా ఇంద్రారెడ్డి, ఏడు మంది వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ ప్రకాశం, ఎద్దుమైలారం మాజీ సర్పంచ్ దశంథ్, మల్కాపూర్ బీజేపీ మాజీ ఎంపీటీసీ తమని, ప్రవీణ్, వివిధ యువజన సంఘం నేతలతో పాటు 600 మంది నేతలు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విట్టల్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రత్నమ్మ కుటుంబానికి అండగా ఉంటాం



నవతెలంగాణ-జహీరాబాద్

మండలంలోని హెూతి(బి) గ్రామానికి చెందిన జోగు రత్నమ్మ ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో బుధవారం మృతి చెందింది. ఈ విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, టీఎస్ఐడీసీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్‌లు ఆస్పత్రికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు విద్యుద్ఘాతానికి గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. వారితోపాటు పీఏసీఎస్ చైర్మెన్ దాసరి మచ్చందర్, సర్పంచ్ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

లెర్నింగ్ లైసెన్స్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జహీరాబాద్

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలని లక్ష్యంతోనే ఉచిత లైసెన్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే మాణిక్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జహీరాబాద్ పట్టణం లోని డ్రైవర్ కాలనీలోని యువకులకు లెర్నింగ్ లైసెన్స్ ధృవ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లర్నింగ్ లైసెన్స్ పొందిన యువకుడు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గీతం అధ్యాపకుడు చిప్ప ప్రవీణ్ కుమార్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-పటాన్‌చెరు

'క్రాస్టాక్ ప్రేరిత ప్రభావాలు, ఆన్ చిప్ వీఎల్ఎస్ఐ ఇంటర్ కనెక్ట్ పనితీరు విశ్లేషణ' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన హైదరాబాద్, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ చిప్ప ప్రవీణ్ కుమార్‌ను డాక్టరేట్ వరించింది. వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఈ.శ్రీనివాసరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల వైస్-ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్‌లు ఈ పరిశోధనను పర్యవేక్షించినట్టు బుధవారం విడు దల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. క్రాస్టాక్-ప్రేరిత ప్రభా వాలను అధ్యయనం చేయడం, నూతన పద్ధతులను ఉపయోగించి అధునాతన ఆన్ చిప్ వీఎల్ఎస్ఐ ఇంటర్ కనెక్ట్ పదార్థాల పనితీరు విశ్లేషణపై ఈ పరిశోధన దృష్టి సారించినట్టు తెలిపారు. ప్రవీణ్ కుమార్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీ ఎస్ఆర్ వర్మ, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.ఆర్.శాస్త్రి, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, ఈఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టి.మాధవి, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

వరద నీటిని అరికట్టేందుకు శాశ్వత పరిష్కారం చూపాలి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లో వరద నీటిని అరికట్టేందుకు శాశ్వత పరికరం చూపాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి.. కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాకు పార్టీ ఏరియా కమిటీ సభ్యులు ఎస్.మహిపాల్ అధ్యక్షత వహించి మాట్లాడారు. వర్షాలకు జహీరాబాద్ పట్టణంలో అనేక కాలనీలు మునిగిపోతున్నాయని.. రోడ్లపై నడవడానికి వీలు లేని దుస్థితి నెలకొన్నా ప్రభుత్వం, అధికా రులు మాత్రం పట్టించుకో కపోవడం సరికాదన్నారు. వర్షాలు పడ్డప్పుడల్లా, నీరు నిలిచినప్పుడల్లా ప్రభుత్వం చేపట్టే చర్యలు తూతూ మంత్రాంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. వరద నీటిని అరికట్టడానికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అలా కాకుండా ఎన్నిసార్లు నీరు మళ్ళించినా.. మళ్లీ వర్షం పడినప్పుడు మునుపటే దుస్థితే వస్తుందన్నారు. తక్షణమే ఈ వరద నీటి సససమ్యకు పరిష్కారం చూపాలని.. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్ర మాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సలీమోద్దీన్, రాజిరెడ్డి, తిరుపతి, నరేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో పత్తి పంటకు తీవ్రనష్టం



నవతెలంగాణ-మునిపల్లి

గత మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంట చేన్లు మొత్తం నీటితో నిండి.. చెరువులను తలపిస్తున్నాయి. దీంతో పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మునిపల్లి మండలంలో 90 శాతం రైతులు పత్తి పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే గత కొద్ది రోజులుగా ఏకధాటి వర్షాలు పడుతుండడంతో.. పత్తి పొలాలన్నీ నీట మునిగాయి. రోజులు తరబడి నీరు నిల్వ ఉండడంతో పత్తి, మిరప మొలకలు పడిపోతున్నాయి. అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే.. అకాల వర్షాలు తమను ఆగం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి అప్పులు ఎలా తీర్చాలంటూ వాపోతున్నారు. ప్రభుత్వమే తమకు నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు.


వికలాంగ ఉపాధ్యాయుడు వెంకటయ్యకు సన్మానం



నవతెలంగాణ-జహీరాబాద్

వికలాంగ అధ్యాపకుడు, స్థానిక మాణిక్ ప్రభు పాఠశాల నిర్వాహకుడు వెంకటయ్య సేవలు ఎంతో అభినందనీయమని శ్రామిక్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్.శివబాబు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా స్థానిక శ్రామిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వెంకటయ్యను ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తిస్తూ సన్మానించారు. తాను వికలాంగుడుని అని నిరుత్సాహ పడకుండా.. తానే స్వతహాగా పాఠశాలలను స్థాపించి.. ఎంతో మంది యువతీయువకులకు ఉపాధిని కల్పిస్తున్న ఘనత వెంకటయ్యకే దక్కుతుందన్నారు. వెంకటయ్యను రోల్ మోడల్‌గా తీసుకొని యువత అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఆయన అందిస్తున్న విద్యా సేవలను గుర్తుచేస్తూ బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వెంక టయ్య మాట్లాడుతూ.. తాను అందిస్తున్న సేవను గుర్తించి.. ఈ బహుమతి ప్రదా నం చేసినందుకు శ్రామిక విజ్ఞాన కేంద్ర సభ్యులైన డాక్టర్ శివ బాబు, డాక్టర్ విజ యలక్ష్మి, ట్రస్టు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రామిక విజ్ఞాన కేంద్ర సభ్యులు రామ్ చందర్, మహిపాల్, విద్యారంగంలో ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు పోషకులు తదితరులు పాల్గొన్నారు.

అలుగు పారుతున్న చెరువులు



నవతెలంగాణ-జోగిపేట

గత మూడ్రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు అందోల్ మండల పరిధి లోని ఆయా గ్రామాల చెరువులు జల కల ను సంతరించు కున్నాయి. మండల పరిధి లోని అన్నాసాగర్ చెరువు ఈ మధ్య కాలం లోనే రెండోసారి అలుగు పారుతుంది. దీంతో రోడ్డున పోయే వాహనదారులు, చుట్టుప్రకాల ప్రాంతాల ప్రజలు చూడడానికి అక్కడికి వస్తున్నారు. ఆయా చెరువులోకి కూడా భారీగా వరదనీరు వచ్చి చేరుతుందని చెబుతున్నారు.



జిన్నారం : మండల పరిధిలోని జంగంపేట జిల్లా ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న మత్తడి పొంగిపొర్లుతున్నది. ఫలితంగా ప్రధాన రహదారిపై గుండా వాగు పొర్లుతుం డడంతో రెండు గ్రామాల మధ్యన రాకపోకల కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గడచిన మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మత్తడి పొంగుతున్నది.

ప్రతిభ విద్యానికేతన్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో గల స్థానిక ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్‌లో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణల వేషధారణలో విద్యార్థులు పలువురుని ఆకట్టుకున్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరిం చాయంటూ ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ సార శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వాన స్థితిలో.. రాజీవ్ పార్క్



- ఏండ్లుగా సుందరీకరణకు నోచుకోని వైనం
- చెత్త సేకరించే ట్రై సైకిళ్ల స్క్రాప్‌యార్డుగా పార్కు
- ముళ్ల పొదలతో నిండిన మరుగుదొడ్లు.. పని చేయని స్తంభాల లైట్లు
- పట్టించుకోని మున్సిపల్ పాలకమండలి

జిల్లా కేంద్రమైన గ్రేడ్ వన్ మున్సిపాల్టీ సంగారెడ్డిలో ఉన్న ఏకైక రాజీవ్ పార్క్.. సరైన పట్టింపులేకపోవడంతో అధ్వానంగా తయారైంది. పిచ్చి మొక్కలు, ముళ్లపొదలకు ఆవాసంగా మారింది. ప్రహారీ ఎత్తు తక్కువగా ఉండడంతో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. టిక్కెట్ కౌంటర్ కోసం ఏర్పాటు చేసిన గది మొదలుకొని.. మరుగుదొడ్ల వరకు అన్ని గదుల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పార్క్‌లోని లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో పోకిరీలకు నిలయంగా మారుతున్నది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి.. పార్క్‌ను సుందరీకరణ చేస్తే.. అటు చిన్నపిల్లలతో పాటు, పెద్ద వారికి కూడా ఆహ్లాదకరకరమైన వాతావరణం దొరుకుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



పార్కులో ఓ స్క్రాప్ యార్డుగా ట్రై సైకిళ్లు..

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందివ్వడానికి 12 ఏండ్ల క్రితం రాజీవ్ పార్కును నెలకొల్పారు. ఆరోగ్య ప్రియుల కోసం వాకింగ్ ట్రాక్‌లు, చిన్న పిల్లలు ఆడుకోవడానికి పరికరాలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదకరంగా పార్కును ఏర్పాటు చేసినప్పటికీ.. సరైన పట్టింపు లేకపోవడంతో రానురాను పార్కు పరిస్థితి అధ్వానంగా తయారవుతూ వచ్చింది. పార్కులో పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటుచేసిన ఆట పరికరాలు అధికారుల పర్యవేక్షణ లోపంతో ఎక్కడికక్కడా విరిగిపోయాయి. ఆహ్లాదకరంగా ఉండాల్సిన పార్కు.. గడ్డితో, పొదలతో నిండిపోయింది. సందర్శకులకు కనువిందు చేసేందుకు ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జల్ విహార్.. సరైన మెయింటెనెన్స్ లేక నిరుపయోగంగా మారింది. అంతేకాకుండా మున్సిపల్ చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసుకున్న ట్రై సైకిల్ పాతబడడంతో వాటిని పార్కులో పడేయడంతో.. స్క్రాప్ యార్డుగా తయార యింది. పార్క్ ప్రవేశానికి కొరకు టికెట్ల కోసం ఏర్పాటు చేసిన గది నిరుప యోగంగా మారింది. వాకింగ్ ట్రాక్ చుట్టూ గడ్డి, చెట్ల కొమ్మలు తో నిండి వాకింగ్‌కు పనికి రాకుండా పోయింది. మరుగుదొడ్ల కోసం ఏర్పాటు చేసిన గది.. చెట్లతో, పొదలతో నిండి ఉపయో గం లేకుండా పోయింది. పార్కుల్లో ఉన్న స్తంభాలకు లైట్లు లేక అంధకారం నెలకొంటున్నది. పదిమంది కార్మికులతో చేయాల్సిన పని ఇద్దరు ముగ్గురితో చేస్తున్నారు. ప్రహరీ ఎత్తు లేకపోవడంతో పార్కులోకి అక్రమంగా చొరబడి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. పార్కుకు నైట్ వాచ్మెన్ దిక్కులేడు. దీంతో పోకిరీలకు నిలయంగా మారుతున్నది. లక్షల టాక్స్‌లు కడుతున్నా.. మున్సి పాల్టీలోని ఏకైక పార్కును ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు పాలకమండలిని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మున్సిపాల్టీ ప్రజలకు ఆహ్లాదకరవ వాతావరణాన్ని అందించే రాజీవ్ పార్కును సుందరీకరణ చేయాలని కోరుతున్నారు.

ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ సుజాతను వివరణ కోరగా.. తాను ఇటీవలే ఇక్కడ బాధ్యతలు స్వీకరించానని.. పార్కును ఇంకా పరిశీలించలేదని తెలిపారు.

పార్క్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



సంగారెడ్డి పట్టణంలో ఉన్న రాజీవ్ పార్క్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో పార్క్‌లో పిచ్చి మొక్కలు పెరిగి అడివిని తలపిస్తున్నది. పిల్లలు ఆడుకునే పరికరాలు తుప్పు పట్టి పాడై పోయాయి. ఓపెన్ జిమ్ పరికరాలు కూడా దెబ్బతిన్నాయి. మొత్తంగా రాజీవ్ పార్క్‌లో నిర్వహణ లోపించింది. వాకింగ్ ట్రాక్ సరిగ్గా లేకపోవడంతో ఉదయం పూట పార్కుకు వచ్చే ఆరోగ్య ప్రియులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పట్టించుకొని రాజీవ్ పార్క్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

- బంగారు కృష్ణ, జన జాగృతి అధ్యక్షులు

పార్క్‌ను ఆధునికరించాలి



రాజీవ్ పార్క్‌ను ఆధునికరించాలి. పార్క్ నిర్వహణ ప్రయివేటు వ్యక్తులకు కాకుండా.. పురపాలిక ఆధీనంలో ఉండాలి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రవేశం ఉండే విధంగా చూడాలి. సిద్దిపేట్, గజ్వేల్‌లో ఏ విధంగా అయితే పట్టణాన్ని అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తున్నారో.. అదే విధంగా సంగారెడ్డి పట్టణాన్ని అభివృద్ధి చేసే విధంగా చూడాలి. పాలకులు సంగారెడ్డిపై సవతి తల్లి ప్రేమ చూపి స్తున్నారు. సంగారెడ్డిలో ఉన్న ఒక్క పార్కు కూడా అధ్వాన స్థితిలో ఉండడం సిగ్గుచేటు.వెంటనే పార్కును ఆధునీకరించాలి.

- ఖాజా అర్షదొద్దిన్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

ఆహ్లాదకర వాతావరణం ఏర్పరచాలి



రాజీవ్ పార్కు నిర్వహణ లోపాలు సరిదిద్దడంలో అధికారులు ప్రజా ప్రతినిధులు విఫలం చెందారు. కొన్నేండ్లుగా సరైన నిర్వహణ లేకపోవడంతో.. పార్కులో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగాయి. పార్కు నిర్వహణ, మరమ్మతుల కోసం లక్షలు ఖర్చు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు.. సరైన నిర్వహణ బాధ్యతలు తీసుకోలేకపోతున్నారు. నాసిరకం పనులు చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా వెంటనే పార్కుకు మరమ్మతులు చేసి..పార్కులో ఆహ్లాదకర వాతావరణాన్ని నెలకొల్పాలి.

- శ్రీధర్ మహేంద్ర, ఫోరమ్ ఫోర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు

పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధిని నోచుకోలేదు



సంగారెడ్డి పేరుకే గ్రేడ్‌వన్ మున్సిపాల్టీ. పాలకుల నిర్లక్ష్యంతోనే రాజీవ్ పార్క్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. నెలలో రెండు మూడుసార్లు మంత్రి సంగారెడ్డి పర్యటన చేస్తుంటారు.. అయినప్పటికీ రాజీవ్ పార్కుపై కనీసం దృష్టిసారించకపోవడం సరికాదు. ఉన్నతాధికారులు ఉంటున్న జిల్లా కేంద్రంలోని పార్కు పరిస్థితే ఈ విధంగా ఉండడం సిగ్గుచేటు. పార్కును స్క్రాప్ యార్డుగా మార్చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు స్పందించి పార్కులో సౌకర్యాలు కల్పించి ఆహ్లాదకర వాతావరణ నెలకొల్పాలి.

- ఎం.యాదగిరి, సీపీఐ(ఎం) సంగారెడ్డి ఏరియా కార్యదర్శి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-జహీరాబాద్

అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, టీఎస్ఐ డీసీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా మిషన్ భగీరథ నీటి సరఫ రాలో న్యాల్కల్ మండలంలో తీవ్ర ఇబ్బందులు జరుగుతున్నాయని.. ప్రతీ గ్రామంలో ప్రతి ఇంట కి నల్లా ఇవ్వాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆ గ్రామంలో ఎన్ని నల్లాలు ఉన్నాయో గ్రామపంచాయతీలో రాసి పెట్టాలన్నా రు. జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్ఎంటి కాలనీలో ఉన్న ప్లాట్ల సమస్యను తక్షణమే పరిష్క రించాలని మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డిని ఆదేశించారు. కోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఇప్పటికే రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లకు అనుభవ దారులను కేటాయించాలన్నారు. అందులో ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి.. విద్యుత్, నీటి సరఫ రా కూడా అందించాలన్నారు. వెంకటాపూర్‌లో పరిశ్రమల ఏర్పాటుకు స్వాధీన పరుచుకుంటున్న భూముల్లో ఎవరైతే రైతులు కబ్జాలో ఉన్నారో వారికే నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించారు. ముస్లిం మైనారిటీల కోసం బూడిదిపాడు గ్రామంలో ఐదెకరాల భూమి స్మశాన వాటికకు కేటాయించి.. ఆ వర్గం వారికి పొజిషన్ ఇవ్వాలని ఆదేశం చారు. సెప్టెంబర్ 15 వరకు ఈ పనులన్నింటినీ శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షపు నీరు జహీరాబాద్ మున్సిపాల్టీ నుంచి బయటికి వెళ్లేందుకు ఉన్న నాలాలపై అక్రమాలను తొలగించి వెంచర్ యజమానులపై కేసులు నమోదు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే వర్షాల కారణ ంగా పంటలు నష్టపోయిన జాబితా తయారు చేయా లన్నారు. గృహ, ఆస్తి నష్టాలు ఎక్కడైనా జరిగితే వాటికి సంబంధించిన వివరాలను తక్షణమే అందజేయాలన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలుచోట్ల విద్యుత్ ప్రమాదాలు తరచుగా జరుగుతు న్నాయని.. ఈ విషయమై విద్యుత్ అధికారులు వెంటనే స్పందించాలని ఆదేశించారు. జహీరాబాద్ ట్రైడెంట్ చక్కర పరిశ్రమలో విధులు నిర్వహి స్తున్న కార్మికుల సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్య లు చేపట్టాలని షుగర్ క్రేన్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీఓ వెంక రె డ్డి, విద్యుత్, మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత రాజకీయాలకు ప్రతీక పటాన్‌చెరు

- కులాల పేరిట ప్రశాంతతను చెడగొడితే కఠిన చర్యలు తప్పవు
- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

స్వేచ్ఛాయుత రాజకీయాలకు ప్రతీక పటాన్‌చెరు నియోజక వర్గమని, కులాల పేరిట విభజన రాజకీయాలు చేస్తూ ప్రశాంతతను చెడగొడితే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతీ ఒక్కరికీ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని, దాన్ని హరించే హక్కు ఎవరికీ లేదనాన్నరు. పటాన్ చెరు నియోజకవర్గం జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగంపేట గ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న కుమ్మరి భాస్కర్‌ను ఎమ్మెల్యే బుధవారం పరామర్శించారు. వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్ నీలం మధు అనుచరులు ఎన్ఎంఆర్ యువసేన పేరుతో బీసీ సామాజిక వర్గం నిరుపేద కుటుంబానికి చెందిన కుమ్మరి భాస్కర్‌ను ఇంటి నుండి బయటకు పిలిచి, అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. తీవ్ర అవమానానికి గురైన భాస్కర్ పురుగుల మందు తాగి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తి ఆత్మహత్యకు ప్రేరేపించేలా బహిరంగంగా దూషించి అవమానించడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భాస్కర్‌కు బీఆర్ఎస్ తరపున అండగా ఉంటామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకటేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ ప్రశాంతి నరేందర్, పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా మారిన షెట్కార్ ఫంక్షన్‌హాల్

- మూడోరోజుకు చేరిన ఢిల్లీ వసంత్ 72 గంటల సామూహిక ప్రార్థన
- పాదయాత్రతో చేరుకున్న కాశీంపూర్ రైతులు
- డాక్టరేట్ జనార్ధన్‌కు ఘనమైన సన్మానం



నవతెలంగాణ-జహీరాబాద్

స్థానిక ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో దళితబంధు లబ్ధిదారులను వాటాదారులుగా మార్చి.. కర్మాగారాన్ని జహీరాబాద్ రైతులకు సొంతం చేయాలనే సంకల్పంతో 72 గంటల పాటు సామూహిక ప్రార్థనలకు ఢిల్లీ వసం త్ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా బుధవారం నాటికి ఈ కార్యక్రమం మూడోరోజుకు చేరింది. మంగళవారం రాత్రి జహీరాబాద్, న్యాల్కల్ మండలాల నుంచి వచ్చిన మహిళా బృందాలతో భజన కార్యక్రమం జరిగింది. బుధవారం నాటికి మండలంలోని కాసింపూర్ గ్రామ రైతులు ఢిల్లీ వసంత్ సంకల్పానికి నైతిక మద్దతుగా నిలుస్తూ పాదయాత్ర ద్వారా షెట్కార్ ఫంక్షన్ హాల్ కి చేరుకున్నారు. రైతులు గొల్ల శంకర్, పెద్దగొల్ల మల్లేశం, పెద్దగొల్ల బక్కన్న, వడ్డెర చంద్రన్న, అల్గోల్ పాపయ్య, వడ్డెర హనుమంతు, కుష్ నూరు అర్జున్‌లు వర్షంలో తడుస్తూ ఫంక్షన్ హాల్‌కు చేరుకోగా.. గ్రామ వారికి ఘనమైన స్వాగతం తెలిపారు. సామూహిక ప్రార్థనలో భాగంగా కవ్వాలి సంగీత బృందం, పాస్టర్ల ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

డాక్టరేట్ జనార్ధన్‌కి ఘన సన్మానం

గత రెండున్నర ఏండ్లుగా జయహెూ జహీరాబాద్ నినాదంతో ముందుకు పోతున్న ఢిల్లీ వసంత్‌కు నైతిక మద్దతుగా నిలిచి.. జహీరాబాద్ అభివృద్ధికై విశిష్ట సేవలు అందిస్తున్న ఇప్పపల్లి వాసి నౌలేగారి జనార్ధన్ ఉన్నత విద్యతో పీహెచ్‌డీ పట్టా పొంది డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జయహెూ జయరాబాద్ బృందం షెట్కార్ ఫంక్షన్ హాల్‌లో జనార్దన్‌ను ఘనంగా సన్మానించారు. వారి కుటుంబ సభ్యులకి శాలువాలు కప్పి ప్రశంసించారు. మట్టిలో మాణిక్యంగా జనార్దన్ సేవలు జహీరాబాద్ అభివృద్ధికి ఎంతో అవసరమని కొనియాడారు. జహీరాబాద్ యువత కోసం, నైపుణ్య శిక్షణ అభివృద్ధి కోసం స్కిల్ బ్యాంక్ ఆలోచనను డాక్టర్ జనార్దన్ ప్రతిపాదించగా ఢిల్లీ వసంత్ చేపట్టిన జయహెూ జయరాబాద్ పాదయాత్ర ముగింపు సందర్భంగా మాజీ మంత్రి కీర్తిశేషులు ఫరీదుద్దీన్ సమాధి వద్ద ఈ స్కిల్‌బ్యాంక్ సాంకేతికను ఆవిష్కరించారు.

ఢిల్లీ వసంత్ ప్రతిపాదనకు విశేష మద్దతు..

దళితబంధు పథకంపై ఢిల్లీ వసంత్ చేసిన ప్రతిపాదనకు అన్ని వర్గాల నుంచి విశేష స్పందన వస్తున్నది. రైతు సంఘాలు, వాణిజ్య సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థలు, ఎన్జీవోలు, వివిధ రాష్ట్రాల్లో ఉన్న సామాజిక వ్యక్తులు ఆయనకు నైతిక మద్దతు ప్రకటించారు. ఈ ఆలోచన విధానం అమలు చేసే లక్ష్యంలో తమ వంతు సహకారం అందిస్తామని విశ్వాసం ఇచ్చారు. మూడో రోజు కార్యక్రమాల్లో మహిపాల్ యాదవ్, బిల్లీ పురం మాధవరెడ్డి, మొహమ్మద్ యాదుల్ల, మాదినం శివ, యాసిర్ ఖాన్, గోవింద్ రెడ్డి, సురేష్, బాల్ రాజ్, మల్లేష్ యాదవ్, కరణం రవి, దినేష్, ఓంకార్, విష్ణు, శ్రీకాంత్, ముదిగొండ శ్రీనివాస్, భూమస్ స్టీవెన్సన్ తదితరులు పాల్గొన్నారు.

'అంగన్వాడీ'ల రాష్ట్ర వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి





నవతెలంగాణ-సంగారెడ్డి, జహీరాబాద్

ఈనెల 11 నుంచి అంగన్వాడీ ఉద్యోగులు చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అంగన్వాడీ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి సంధ్యారాణికి, జహీరాబాద్‌లో సీడీపీఓ కార్యాలయంలో బుధవారం సమ్మె నోటీస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలో జి.సాయిలు, యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.మంగ, జహీరాబాద్‌లో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ మాట్లాడుతూ.. గత 40 ఏండ్లకు పైగా అంగన్వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్స్, హెల్పర్స్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. పని భారాన్ని పెంచుతూ.. సంబంధం లేని పనులను కూడా అప్పగిస్తున్నదన్నారు.పశ్చిమ బెంగాల్, అస్సాం, కర్ణాటక రాష్ట్రాల్లో సదరు సౌకర్యాలు అమలు చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా గుజరాత్, కర్ణాటక, హర్యానా రాష్ట్రాల్లో గ్రాట్యుటీ చట్టం అమలు జరుగుతున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వీటిల్లో ఏ సౌకర్యం కూడా అమలు చేయడం లేదన్నారు. పది రోజుల క్రితం అంగన్వాడీ యునియన్లతో జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీలకు భిన్నంగా ప్రకటనలను చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అంగన్వాడీ వర్కర్ పేరుని టీచర్‌గా మార్పు చేశారని, కానీ అంగన్వాడీ జీవితాల్లో ఏమార్పు రాలేదన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి, అస్సాం, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్వాడీలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి,హెల్త్ కార్డ్‌లను ఇచ్చారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పంది ంచి అంగన్వాడీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లేని యెడల ఈనెల 11నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర వధిక సమ్మెకి వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డిలో యూనియన్ జిల్లా అధ్యక్షులు శశికళ, ఏసు మని, నాగేశ్వరి, జమున, శాంతమ్మ, గౌరమ్మ, భ్రమరాంబ, భ్రమ రాంబ, సత్య, జహీరాబాద్‌లో సబీత, వసీమా తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
గురువారం | సెప్టెంబరు 07 2023 | www.navatelangana.com

నూతన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్



నవ తెలంగాణ-మెదక్ టౌన్

జిల్లా కేంద్ర నూతన గ్రంథాలయ భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ రాజర్షి బుధవారం మధ్యాహ్నం పరిశీలించారు. గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్ ఆహ్వానం మేరకు జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాన్ని కలెక్టర్ సందర్శించారు. భవన నిర్మాణ పనులను చూసి కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. గార్డెనింగ్ కోసం మున్సిపల్ డీఈని మొక్కలు నాటాలని ఆదేశించారు. అధ్యక్షులు కొంత ఫర్నిచర్‌కు డబ్బులు అవసరం ఉందని కోరగా సిబిఎఫ్ నిధుల నుంచి సమకూరుస్తామని హామీ ఇచ్చారు. సి ఎస్ ఆర్ నిధుల నుంచి కూడా ప్రయత్నిస్తామని తెలిపారు. కన్స్ట్రక్షన్ డీఈ అన్సార్ అలీని త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిరుద్యోగ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాత భవనంలో ఇబ్బంది పడుతున్నారని, త్వరగా పూర్తిచేసుకుని పది రోజులలో కొత్త భవనం ప్రారంభోత్సవం జరగాలని సంబంధిత అధికారులని ఆదేశించారు. కలెక్టర్‌కు అధ్యక్షులు దొంతి చంద్ర గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ వంశీకృష్ణ, సిబ్బంది కె నరేందర్ రెడ్డి, ఎం శంకర్, యాదగిరి, అన్సర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అలుగు పారుతున్న చెరువులు



అలుగులకు పూజలు

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో భారీగా వర్షాలు కురిసాయి. పెద్ద ఎత్తున వర్షాపాతం నమోదు కావడంతో గ్రామాల్లోని చెరువులు కుంటలు పొంగిపొర్లుతున్నాయి. గ్రామాలలో చెరువులు ఎన్నడు లేని విధంగా అలుగులు పారుతుండడంతో గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని లింగారెడ్డిపేట గ్రామంలో చెరువు అలుగు పారడంతో గ్రామ సర్పంచ్ శివ్వగోని సుగుణమ్మ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు గ్రామ దేవతలైన కట్టమైసమ్మ, గంగమ్మ తల్లిల్లకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలను చల్లంగా చూడాలని వారు దేవతలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహసభ జిల్లా నాయకులు దాసరి నరేష్‌ముదిరాజ్, మన్నె సత్యనారాయణ, దుర్గయ్య, శ్రీనివాస్, పిట్ల బాల్‌రాజ్, వెంకటేస్, మణికంఠ, నర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలి



జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

వర్షాలు అధికంగా కురుస్తున్నందున రైతులు పంటలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ సూచించారు. తూప్రాన్ మండలం మల్కాపూర్‌లో వరి, మక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలను బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున పొలాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. అలాగే వరిలో కాండం తొలుచు కీటకాలు వచ్చే అవకాశం ఉంటుందని వాటికి తగిన మోతాదులో మందులను వాడాలని సూచించారు. పంటలకు అగ్గి తెగులు రాకుండా మందులను పిచికారి చేయించాలని సూచించారు. అలాగే పంటలను కాపాడుకునేందుకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మండల వ్యవసాయ అధికారి గంగమల్లు, ఏఈవో సిందులతో పాటు రైతులు పాల్గొన్నారు.

పౌష్టికారం లోపం లేకుండా చూడాలి



ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి

నవతెలంగాణ-టేక్మాల్

గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పుట్టబోయే బిడ్డలకు పౌష్టికాహార లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత అంగన్వాడీ టీచర్లదేనని ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి అన్నారు. బుధవారం. టేక్మాల్‌లోని అంగన్వాడి సెంటర్లలో గర్భిణీలకు బాలింతలకు పౌష్టికారాన్ని అందించిన అనంతరం ఆమె వారినుద్దేశించి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పౌష్టికాహార లోపం లేకుండా అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. గర్భిణీ స్త్రీలు ఉడకపెట్టిన గుడ్లను, పాలను రోజు తప్పనిసరిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇవి అంగన్వాడి సెంటర్ల ద్వారానే సరఫరా చేస్తున్నారని గుర్తు చేశారు. పౌష్టికాహారాన్ని గర్భిణీలకు బాలింతలకు అందివ్వకుండా టీచర్లు ఆయాలు చూస్తే వారిపై కఠిన చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు చింత స్వప్న రవి, టేక్మాల్ సర్పంచ్ సుప్రజా భాస్కర్, ఆరోగ్య కార్యకర్తలు భూదేవి, అంగన్వాడీ టీచర్లు, విజయ, యశోదలు ఉన్నారు.

నిజాంపేట నుంచి బాసరకు బస్సు సౌకర్యం



నవతెలంగాణ-నిజాంపేట

జనగామ డిపోకు చెందిన బస్సు బాసరకు వేశారు. వయా చేర్యాల, సిద్ధిపేట నిజాంపేట, నుంచి బాసరకు, నిజాంపేట మండల కేంద్రానికి సాయంత్రం 4:30 గంటలకు చేరుకుంటుంది. చుట్టుముట్టు గ్రామాల ప్రజలకు బాసర వెళ్లడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బాసరలో దక్షిణ భారతదేశంలోని వెలసిన సరస్వతి ఆలయము ప్రసిద్ధి చెందినది. చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం మొదలు పెట్టేవారు బాసర ఆలయానికి తప్పకుండా వెళ్లి అక్షరాభ్యాసం చేయించేందుకు వీలు కలిగింది. బాసరలో త్రిబుల్ ఐటీ కాలేజ్ కూడా ప్రఖ్యాతి గాంచినది. బాసరకు వెళ్లిన భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తారు. శ్రావణమాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో బయలుదేరుతున్నారు. జనగామ డిపో మేనేజర్‌కు అధికారులకు నిజాంపేట మండల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారు.

కూలిన రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులు ప్రారంభం



నవ తెలంగాణ-వెల్దుర్తి

మాసాయిపేట మండలం రామంతపూర్ తాండ వెళ్లే రహదారిలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని గతంలో కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేపట్టి ప్రహరీ గోడ నిర్మించడం వల్ల కూలిపోయిందని తాండ వాసులు ఆరోపణలు చేశారు. తాండ సర్పంచ్ గోపి పకీర ఎంపిటిసి సోనీ శ్రీనివాస్ నాయక్ బుధవారం సంబంధిత కాంట్రాక్టర్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన కాంట్రాక్టర్ తాండవాసులకు ఇబ్బంది కలగకుండా పనులను ప్రారంభించి వేగవంతం చేశారు. తాండకు సంబంధించిన ప్రజాప్రతినిధుల వల్లనే పనులు వెనువెంటనే పరిష్కరించి, ఇబ్బంది లేకుండా చేయడం జరిగిందని తండా ప్రజలు అన్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యమైన ప్రహరి గోడ కట్టడాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



నవతెలంగాణ-నర్సాపూర్

లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యా య దినోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని లైన్స్ క్లబ్ భవనంలో, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు మెమొంటోళ్లు అందజేసి, శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రతినిదులు రామకృష్ణారెడ్డి, రాఘవేందర్ రావు, లైన్స్ క్లబ్ అధ్యక్షులు అశోక్ కుమార్ ,లైన్స్ క్లబ్ సభ్యులు లకావత్ రమేష్ నాయక్, ఆంజనేయులు గౌడ్, శ్రీకాంత్, పైడి శ్రీధర్ గుప్తా, జైపాల్, బుచ్చే ష్ యాదవ్, మండల విద్యాధికారి బుచ్చా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సహజ కూరగాయ విత్తనాలపై అవగాహన

తెలంగాణ డెవలమెంట్ ప్రోమ్ జైకిసాన్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



నవతెలంగాణ-నిజాంపేట

సహజ కూరగాయ విత్తనాలపై తెలంగాణ డెవలమెంట్ ప్రోమ్ జైకిసాన్ చైర్మన్ నరేందర్‌రెడ్డి బదవారం నిజాంపేట మండల కేంద్రంలోని 12 గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం తినే ఆహారంలో రసాయనాలు కలవడంతో తరచు ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. కావున రైతులు సహజ ఎరువులు, సహజ విత్తనాలపై మొగ్గు చూపాలన్నారు. మండలంలో పలు రైతులకు సహజ కూరగాయ విత్తనాల అవగాహనతో పాటుగా విత్తనాలు పంపిణీ చేశారు. తక్కువ ఖర్చుతో కూడిన పనిముట్లను అందజేశామన్నారు. ప్రజారోగ్యం కోరకు రైతులు సహజ కూరగాయ విత్తనాలు వేసుకోని తనతో పాటు తన చుట్టూ ఉన్న వినియోగదారులకు ఆరోగ్యం బాగుండాలనే ఉద్దేశ్యంతో సహజ ఎరువులు, కూరగాయ పద్ధతిని ఎంచుకున్నట్లు తెలిపారు. రసాయన ఎరువులు వాడి అనారోగ్యం పాలుకాకుండా సహజ ఎరువులు, కూరగాయ పద్దతిని ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మండల రైతులు పెద్దపైడి శ్రీదర్ రెడ్డి, సుదాకర్‌రెడ్డి, పంజా శ్రీనివాస్, శెనిగపల్లి రాజ్యం, రత్నగారి రాజేశ్వర్ రెడ్డి, బాపురెడ్డి, కిషన్, మహిపాల్, రాజు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవేందర్ రెడ్డి దండుపాలెం ఎంతో దోచుకుంది

- అవినీతి చేయకుంటే పసుపు బట్టలతో ఏడుపాయల రావాలి
- 200 మందితో మేము వస్తాము
- సవాల్ విసిరిన సొంత పార్టీ నేతలు



నవతెలంగాణ-మెదక్

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి భర్త దేవేందర్ రెడ్డి దండుపాలెం బ్యాచ్ తొమ్మిదేళ్లలో ఏళ్లలో ఎంతో దోచుకుందని, ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదంటే పసుపు బట్టలతో ఏడుపాయల ఆలయానికి గురువారం ఉదయం రావాలని బీఆర్ఎస్ పార్టీ నేతలు సవాల్ విసిరారు. బుధవారం మెదక్ పట్టణంలోని విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గంగాధర్, జీవన్, రాజాసింగ్ మాట్లాడుతూ.. దేవేందర్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. దేవేందర్ రెడ్డితో పాటు పదవి అనుచరులు చేసిన భూ కబ్జాలు, అవినీతి చిట్టాను ఆధారాలతో సహా బయటపెడతామన్నారు. చిన్న శంకరంపేట జెడ్పీటీసీ మాధవి భర్త రాజు భూ కుంభ కోణం ఆధారాలతో సహా ఇస్తామన్నారు. కార్యకర్తలు చేసిన తప్పుల్లో దేవేందర్ రెడ్డి ప్రమేయం లేదా అని ప్రశ్నించారు. చిన్న శంకరంపేట మండలం గవ్వల పల్లి చౌరస్తాలోని వెంచర్ పర్మిషన్ కోసం 4 ప్లాట్లు అడిగారని, ఇందులోనూ దేవేందర్ రెడ్డి ప్రమేయం లేదా అని ప్రశ్నించారు. గత తొమ్మిది ఏళ్లలో 20 కోట్ల విలువ చేసే ఇల్లు, వందల ఎకరాల భూములు ఎలా వచ్చాయని, ఎలాంటి అవినీతి అక్రమాలు చేయకపోతే గురువారం ఉదయం ఏడుపాయల అమ్మవారి ఆలయానికి పసుపు బట్టలతో రావాలని సవాల్ విసిరారు. తమ కూడా 200 మంది కార్యకర్తలతో ఏడుపాయల వద్దకు వస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓట్లు వేసి ఎన్నుకన్న పాపానికి తమ పరిస్థితి నవ్వుకున్నట్లు అయిందన్నారు. కోనాపూర్ సొసైటీలో 2.5 కోట్ల అవినీతికి పాల్పడింది వాస్తవం కాదా అని, ఉద్యమంలో పనిచేసిన నాయకులకు కాకుండా కోట్ల డబ్బులు తీసుకొని మెదక్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారికి ఛైర్మెన్ పదవిని కట్టబెట్టింది నిజం కాదా అని, కాంట్రాక్టర్లను డబ్బుల కోసం వేదించిన విషయం వాస్తవం కాదా అని, మెదక్ మండలంలోని మహిళా నాయకురాలికి పలు పదవులను కట్టబెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఉద్యమంలో పని చేసిన నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారని గుర్తుచేశారు. ఏడుపాయల ఈఓ వివాదంలో దేవేందర్ రెడ్డి వాటా ఎంత అని, 8 నెలల నుంచి గ్రేడ్ 1 అధికారి వస్తుంటే రాకుండా అడ్డుకుంది దేవేందర్ రెడ్డి కదా అని ప్రశ్నించారు. 8 ఏళ్ల నుంచి ఈఓపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, ఏడుపాయల అవినీతి పై సమగ్ర వివరాలతో ఫిర్యాదు చేసిన విషయం వాస్తవం కదా అని చెప్పారు. ఏడుపాయల జాతరలో ఏ అర్హతతో పది రోజులు ఉంటున్నారనే విషయంలో దేవేందర్ రెడ్డి స్పష్టత ఇవ్వాలన్నారు. తొమ్మిది మడిగలు కట్టిన తరువాత ఎలాంటి రశీదు ఇవ్వకుండా ఒక్కో దానికి రూ. 4 లక్షలు తీసుకున్నది వాస్తవం కాదా అని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా దేవేందర్ రెడ్డి బావమరిది చేయలేదా అని ప్రశ్నించారు. చివరికి మెదక్ విలేకరుల నుంచి డబుల్ బెడ్ రూం ఇళ్ళ కోసం ఒక్కొక్కరి నుంచి రూ. 3 లక్షలు తీసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ ప్రసాద్ రెడ్డి రూ. 50 లక్షలు కట్టడానికి అయిందని, రూ. 50 లక్షలు దేవేందర్ రెడ్డికి ఇచ్చామని చెప్పడంలో వాస్తవం లేదా అని ప్రశ్నించారు. ఎలాంటి తప్పులు చేయకుంటే గురువారం 11 గంటలకు ఏడుపాయల అమ్మవారి వద్దకు పసుపు బట్టలతో రావాలని, లేకుంటే తప్పులు, అవినీతి అక్రమాలు చేసినట్లేనని చెప్పారు. ఈ సమావేశంలో రాజిరెడ్డి, రాజశేఖర్ సిద్ధిరాములు, మనోజ్ తదితరులున్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం, ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశానికి ఆయా ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ముందుగా ఆయా శాఖలకు చెందిన అధికారులు వారి వారి శాఖల ద్వారా గ్రామాలకు అందిస్తున్న సేవలను వివరించారు. ఎక్సైజ్ ఎస్ఐ అరుణ మాట్లాడుతున్న సమయంలో ఆయా గ్రామాల సర్పంచులు కలుగజేసుకొని గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సై అరుణ మాట్లాడుతూ త్వరలో గ్రామాలలో పర్యటించి బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుంటామన్నారు . ఆర్టీసీ శాఖకు చెందిన పోచయ్య మాట్లాడుతున్న సమయంలో వైస్ ఎంపీపీ వెంకట నర్సింగరావు కలగజేసుకొని నర్సాపూర్ బస్ డిపోకు చెందిన బస్సును నర్సాపూర్ నుంచి వేములవాడ కొండగట్టుకు వేయాలని కోరారు. ఈ విషయమై పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్టీసీ ఉద్యోగి పోచయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసే గ్రామాలలోని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు ఐసిడిఎస్ అధికారులు ప్రజా ప్రతినిధుల అధికారుల చేత. గ్రామాలలోని చిన్నపిల్లలకు పౌష్టికారం అందించేలా చూస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మార్టిన్ లూథర్, ఆయా గ్రామాల సర్పంచులు జితేందర్ రెడ్డి, కరుణాకర్ ,శివకుమార్, సురేష్ , భాస్కర్ రాజు, వెంకటలక్ష్మి, అధికారులు స్వామి దాస్ ,ప్రవీణ్ రాజ్ కుమార్, లక్ష్మీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు







నవతెలంగాణ-మెదక్

మెదక్ శివారులోని మంబోజిపల్లి గీతా ఉన్నత పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో వెన్నదొంగ కన్నయ్య అంటూ నృత్యం చేశారు. పాఠశాల ఆవరణలో చిన్నారులు చేసిన కృష్ణుడి మహిమలను చూసి ఆనంద పరవశంలో మునిగితేలారు. విద్యార్థుల కోలాటలు, నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కృష్ణుడు ఉట్టికొట్టే సన్నివేశం ప్రత్యేక ఆకరణీయంగా నిల్చింది. ఈ కార్యక్రమంలో గీతా విద్యాసంస్థల యాజమాన్యం మాధవిరామాంజనేయులు, రామాంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలో భాష్యం విద్యా మందిర్‌లో విద్యార్థినిలచేత కృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను కృష్ణా గోపికల ను తయారు చేయించి అబ్బురపరిచే విధంగా పాఠశాల ప్రహరిలో ఘనంగా నిర్వహించారు. గోపికల వేషధారణ చూసిన తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు అలనాడు జరిగిన సంఘటనను కండ్లకు కట్టొచ్చినట్టుగా బాలికలు వారి ఆటపాటలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పులి జాడలు లేవు.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



నవ తెలంగాణ-టేక్మాల్

పులి జాడలు లేవు అయినా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బీట్ ఆఫీసర్ రమేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెరువు ముందర తండాలో, ఆవు లేగ దూడపై దాడి చేసిందని పుకారును, గిరిజనులు పుట్టించడంతో సీఎం తాండాను అధికారులు సందర్శించారు. దాడి జరిగిన ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించి ఉదయం వర్షం పడటంతో పులి పాదముద్రలు చెరిగిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లేగదూడపై దాడి జరిగిన యజమానులను పిలిచి విచారించగా సరియైన సమాధానం చెప్పలేరన్నారు. అటవీ ప్రాంతంలో ప్రయాణించి వెతికినప్పటికిని పులిజాడలు కనిపించలేదని చెప్పారు. అడవిలోకి పశువులను మేకలను తీసుకు వెళ్లకుండా గిరిజనులు జాగ్రత్తపడాలని గ్రామస్తులను కోరారు. గ్రామంలో దండోరా వేయించి ప్రజలను జాగ్రత్తపరచాలని సూచించారు. పులిజాడలు కనిపిస్తే బీట్ ఆఫీసర్ రమేష్ నెంబర్ 9440885682 కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే పులిని బంధిస్తామని చెప్పారు. రూట్ ఆఫీసర్ కుర్తీష్, ముస్తాకులు ఉన్నారు.

అంగన్‌వాడిలో పోషన్ అభియాన్ మాసోత్సవాలు



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్) : పుట్టిన బిడ్డకు మొదటి నెల నుంచే మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించాలని, దాంతో బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు గ్రామ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. బుదవారం మండలంలోని కాళ్ళాకల్‌లోని ఒకటవ అంగన్‌వాడి కేంద్రంలో పోషన్ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలు ఆరోగ్యంగా ధృడంగా ఉండాలంటే మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. దాంతో పాటు చిన్న పిల్లలకు తల్లి పాలు చాలా ముఖ్యమని తెలిపారు. ఆకుకూరలలో చాలా విటమిన్లు ఉంటాయని, దాంతో పాటు పాలు, గుడ్లు లాంటి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సక్కుబాయి, డాక్టర్ ప్రియాంక, ఏఎన్ఎం స్వర్ణలత, వరలక్ష్మీ, అంగన్‌వాడి టీచర్ నాగరాణి, సుశీలా, స్వర్ణలతలతో పాటు పిల్లలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో పోషణ మాసం కార్యమం గ్రామ సబ్ సెంటర్‌లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిల్లెట్స్, సానిటైజేషన్ గురించి అనగా ఇండ్ల చుట్టు పరిశుభ్రత పాటించాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అరుణ, సూపర్ వైజర్ గ్రామ సెక్రటరీ కవిత, అంగన్వాడీ టీచర్లు పద్మ, లలిత, రాజమని, ఫర్జానా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

విద్యార్థులు చదువు ద్యాస ఉంచి బాగా చదువుకోవాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండి అనుకున్న లక్ష్యాన్ని సాధించి సమాజంలో గౌరవంగా జీవించాలని మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి విద్యార్థులకు సూచిం చారు. జిల్లా ఎస్పి ఆదేశాలతో బుధవారం మండలంలోని కూచారం గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో షీటీం, కళాబృందంతో ప్రదర్శణ నిర్వహించి 100 డయల్ ఉపసయోగంలాంటి వాటిపై అవగాహన కల్పించారు. ఆకతాయిల నుంచి రక్షణ పొందేందుకు వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలని వెంటనే పోలీసులు వస్తారని సూచించారు. అలాగే గుర్తు తెలియని వారు తమ బ్యాంకు అకౌంట్ నంబర్ కావాలంటూ ఉచితంగా డబ్బులు వస్తాయని ఓటీపి తెలపాలని అడుగుతారని అలాంటి వారి నుంచి జాగ్రత్తగా ఉండాలని సైబర్ నేరాల పట్ల అవగాహనతో ఉండాలని సూచించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు తప్పని సరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. అలాగే యుక్త వయస్సు వచ్చే వరకు ఆడపిల్లలకు వివాహాలు చేయవద్దని బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా కళాబృందం పాటల ద్వార మ్యాజిక్ ద్వార విద్యార్థులకు అర్థమయ్యే విధంగా తెలియజేశారు. కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానించిన సర్పంచ్



నవతెలంగాణ - నార్సింగి

ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికై జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డిల చేతుల మీదుగా సన్మానం పొందిన మండలంలోని పెద్ద తాండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జెట్టి మల్లేశంకు పెద్ద తాండా ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ చత్రియా నాయక్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడు మల్లేశంతో పాటు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు పోల్కం వాసు, ఆంగన్వాడి టీచర్ వినోదలకు సర్పంచ్ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చత్రియా మాట్లాడుతూ జెట్టి మల్లేశం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అవ్వడం తనకు సంతోషాన్ని కలిగించిందన్నారు. ఇలాంటి అధ్యాపకుడు తమ గ్రామ పిల్లలకు విద్యా బోధన చేయడం తమకు గర్వ కారణమన్నారు. మల్లేశం తన వృత్తి పట్ల ఇలాగే నిష్ఠ తో ఉండాలని భవిష్యత్తులో ఇంకా ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు గ్రామ పంచాయితీ కార్యదర్శి బాలు, వార్డు సభ్యులు చందర్ మహారాజ్, చందర్, బానొత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సవాల్ స్వీకరిస్తున్నా..

గురువారం 8 గంటలకు ఏడుపాయలకు రండి

ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ-పాపన్నపేట

రాజకీయంగా ఎదుర్కోలేక తనపైన నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి కృషి ఫలితంగా నియోజకవర్గంతో పాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఏడుపాయల ఈవో అక్రమాలకు పాల్పడితే తనకేం సంబంధం అని ఆయన ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న తనపై అనవసరమైన ఆరోపణలు చేస్తూ ఉద్దేశ్య పూర్వకంగా తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు అక్రమాలకు పాల్పడితే సంబంధిత శాఖ అధికారులు విచారణ చేపట్టి, శాఖా పరంగా తగు చర్యలు తీసుకుంటారని ఆయన స్పష్టం చేశారు. తనపై కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, తాను ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని వన దుర్గామాత ఆలయం వద్ద తడి బట్టలతో ప్రమాణం చేసేందుకు సిద్ధమన్నారు. తనపై ఆరోపణలు చేసిన వారు (7.09.2023) గురువారం ఉదయం 8గంటలకు ఏడుపాయలకు రావాలని దేవేందర్ రెడ్డి సవాల్ విసిరారు.

సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రూ. 15లక్షల నిధులతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ- కొల్చారం

వర్షాల దృష్ట్యా సీజనల్ వ్యాఖ్యలు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ అద్యక్షురాలు కోరబోయిన మంజుల, జడ్పీటీసీ సభ్యురాలు ముత్యంగారి మేఘాల అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ మంజుల అద్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం వారి వారి నివేదికలను సభ ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ మేఘాల మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధుల ద్వారా ప్రతి గ్రామ పంచాయతీ కి రూ.15లక్షలు విడుదల చేసిందని వాటితోటి గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి, తహశీల్దార్ గఫ్ఫార్, వ్యవసాయాధికారి స్వేతాకుమారి, ఏపీవో మహిపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పార్ట్ టైం ఉపాధ్యాయుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

- 13 వరకు చివరి గడువు
- జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మెదక్

జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఖాళీగా ఉన్న పార్ట్ టైం ఉపాధ్యాయుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. మెదక్ (బాలికల), నర్సాపూర్ (బాలికల), చేగుంట (బాలికల), కౌడిపల్లి (బాలుర), నర్సాపూర్ (బాలుర), పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను పూర్తి తాత్కాలిక పద్ధతిన ఈ విద్యా సంవత్సరం కొరకు పనిచేసే వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మెదక్ (బాలికల) పాఠశాల, జూనియర్ కళాశాలలో (01 జెల్-ఫిజిక్స్), (01-పీజిటీ- ఇంగ్లీష్), (01-పీజీటీ-గణితం), (01-ఫిసికల్ సైన్స్), (01- బయోసైన్స్), నర్సాపూర్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో (01-పీజీటీ- ఇంగ్లీష్),(01-పీజీటీఫిజిక్స్), (01-పీజీటీ- గణితం), (01-పీజీటీ -సోషల్), చేగుంట (బాలికల) పాఠశాల, జూనియర్ కళాశాలలో, (01 జెల్-ఫిజిక్స్), (01 జెల్-బోటనీ), కౌడిపల్లి (బాలుర), పాఠశాల, జూనియర్ కళాశాలలో (01- ఫిసికల్ సైన్స్), నర్సాపూర్ (బాలుర), పాఠశాల/ జూనియర్ కళాశాలల్లో (01 జెల్- ఇంగ్లీష్), (01 జెల్- మాథ్స్), (01 జెల్- బోటనీ), (01 జెల్- జూవాలజి), (01 జెల్- కెమిస్ట్రీ), ఇంగ్లీష్ సబ్జెక్టులో బోధించేందుకు పీజీ 50శాతం మార్కులతో బిఈడి, టెట్‌లో ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13 లోపు మెదక్‌లోని మినీ గురుకులంలో గల (జిల్లా కోర్టు రోడ్డు) ఆర్ సి ఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. బాలికల పాఠశాలల్లో మహిళలకు మాత్రమే అవకాశం ఉందన్నారు. అభ్యర్థుల ఎంపిక డెమో మెరిట్ ఆధారంగా పారదర్శకంగా జరుగుతుందని వివరించారు.

సైబర్ జాగృతీ దివస్ నిర్వహించిన ఎస్ఐ



నవతెలంగాణ-నార్సింగి 4

జిల్లా ఎస్పీ ఆదేశాను సారం ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దిన్ ఆధ్వర్యంలో బుధవారం 'సైబర్ జాగృతీ దివస్" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ నేరాలు ఎక్కువ శాతం ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం కొరకు డబ్బులు కట్టాలని, తమ సంస్థలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభం వస్తుందని ఆశ చూపి అమాయక ప్రజలను మోసం చేస్తారని తెలిపారు. ప్రజలు ఇలాంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చిన్న పిల్లలు, ఆడ పిల్లలు ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వాడేటప్పుడు వారిపై కన్నేసి ఉంచాలని, నేరగాళ్ల అమ్మాయిలను మాయ మాటలతో మభ్య పెట్టి అనంతరం వారికి అనేక రకాల వేధింపులకు గురచేస్తున్నారన్నారు. దీనిపై పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. ఆన్లైన్‌లో కొనుగోలు చేసేటప్పుడు, లావాదేవీలు జరిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఒక వేల ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రతీ నెలా మొదటి బుధవారం సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అహ్మద్‌తో పాటు ఏఎస్ఐ మానిక్ ప్రభు, పోలీస్ సిబ్బంది ఖాజా జహంగీర్, జక్క రాజు, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్వాడి టీచర్‌ను తొలగించాలి



నవతెలంగాణ-టేక్మాల్ : మండలంలోని వేల్పుగొండ గ్రామం బోల్లి కుంట తండాలో మినీ అంగన్వాడి సెంటర్లో విధులు నిర్వహిస్తున్న మూడవత్ కోమిలి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని తండావాసులు ఆరోపించారు. గత కొన్ని నెలలుగా అంగన్వాడి ఉప కేంద్రానికి రాకుండా కిశోర బాలబాలికల చదువుపై, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోకుండా హైదరాబాద్‌లోనే ఉంటున్నారని ప్రస్తుతం 11 నెలల నుంచి తాండాకు రాలేదని ఎల్లుపెట్ సెక్టార్ సూపర్వైజర్ భాగ్యమ్మకు తాండ వాసులు ఫిర్యాదు చేశారు. తాండావాసుల నిర్ణయం ప్రకారం గ్రామ సర్పంచ్ బోయిని నారాయణ సమక్షంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న మూడవత్ కోమిలి స్థానికంగా లేనందున విధుల నుంచి తీసివేసి నూతన అంగన్వాడి టీచర్‌ను కేటాయించాలని గ్రామపంచాయతీ సమక్షంలో పంచాయతీ తీర్మానం చేసి సెక్టర్ సూపర్వైజర్ భాగ్యమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయిని నారాయణ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ వార్డు సభ్యులు కొండ ఆనందం తాండా పెద్దలు శంకర్ నాయక్ కిషన్ నాయక్ రాంసింగ్ నర్సింలు లక్ష్మణ్ సంతోష్ నాయక్ రాంజీ నాయక్ హరి నాయక్ శత్రు నాయక్ తాండ యువకులు ప్రకాష్ గణపతి తుకారాం సురేష్ రెడ్యా నాయక్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
గురువారం | సెప్టెంబరు 07 2023 | www.navatelangana.com

కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కార్మికుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో 17వ వార్డులో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న భవన నిర్మాణ కార్మిక తాపీ సంఘ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని అన్నారు .దేశంలోని ఏ రాష్ట్రంలో లేనటువంటి సంక్షేమ పథకాలు అమలు పరుస్తూ కార్మిక, కర్షక ,సబ్బండవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమరవెల్లి మల్లన్న ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా బుధవారం మల్లికార్జున స్వామి వారి ఉత్సవ మూర్తుల ఊరేగింపు సేవను దేవాలయం నుంచి మొదలుకొని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. శ్రీకృష్ణుడు గొల్లభామ వేషధారణతో ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి దేవాలయం వద్ద పెద్దపట్నం కార్యక్రమాన్ని ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బిక్షపతి, ఏఈఓ వైరాగ్యం అంజయ్యాయ, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, పాలకమండలి సభ్యులు దేవాలయ అర్చకులు ఒగ్గు పూజారులు ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

లక్ష మెజారిటీయే తమ లక్ష్యం



నవతెలంగాణ- దుబ్బాక

మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపు ఎప్పుడో ఖాయమైందని, లక్ష మెజార్టీయే తమ లక్ష్యమని బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపల్ సీనియర్ నాయకులు గన్నె భూమిరెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో దుబ్బాక గడ్డపై గులాబీ జెండాను ఎగరవేస్తామన్నారు. బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలో వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులు, జిల్లా మంత్రి హరీష్ రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక సహకారంతోనే దుబ్బాక నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి మభ్యపెట్టడం ఇక్కడి ఎమ్మెల్యేకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. నేరుగా నిధులు తెచ్చి దుబ్బాకను అభివృద్ధి చేసే దమ్మున్న నాయకుడు కొత్త ప్రభాకర్ రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. ఎంపీ ప్రభాకర్ రెడ్డి గెలుపు తథ్యమని, ప్రతిపక్షాలకు డిపాజిట్లు సైతం దక్కవని నొక్కి చెప్పారు. 4, 8 వార్డుల కౌన్సిలర్లు ఇల్లందుల శ్రీనివాస్, దుబ్బాక బాలకృష్ణ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ కోల వెంకటస్వామి గౌడ్ ఉన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



నవతెలంగాణ-జగదేవపూర్

తమను క్రమబద్ధీకరణ చేయాలని గత వారం రోజులుగా సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్న పద్ధతిలో నిరసన తెలియజేస్తున్నారు. అందులో భాగంగా జగదేవపూర్ నుంచి సమగ్ర శిక్షలో పనిచేసే వారు తరలి వెళ్లారు. గత 15 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా 22000 మంది చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారు. విద్యాశాఖలో వీరిని విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళలకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు నిరసన ఆపేది లేదన్నారు. ప్రభుత్వం ఈ నెల 11వ తేదీ వరకు మా డిమాండ్లపై స్పందించక పోతే 11వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగదేవపూర్ మండలములో పనిచేస్తున్న ఎమ్ఐఎస్, సిసిఓ , సీఆర్పీలు, ఐఈఆర్పిలు, పిటిఐలు, హెూటల్ సిబ్బంది, మెసెంజర్ ఉన్నారు.

మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ-దౌల్తాబాద్

కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు పురస్కరించుకొని మండల పరిధిలోని సూరంపల్లిలో చతుర్విధ టాలెంట్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు బాలకృష్ణ వేషధాలతో సాంస్కృతిక కార్యక్రమాలు చేసి ప్రజలను ఆకట్టుకున్నారు. నేటి సమాజం పూర్తిగా 100 ఫోన్ల వైపు మొగ్గు చూపుతుంటే ఇలాంటి మారుమూల గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేయడంలో వారికి వారే దిట్ట అని స్థానిక ప్రజలు అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదే మాదిరిగా మండల వ్యాప్తంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

శ్రీకృష్ణుని 10 అడుగుల భారీ చిత్రం



నవతెలంగాణ-గజ్వేల్

భగవంతుని సేవకు మించిన భాగ్యం మరొకటి లేదని కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని చిత్రాన్ని అవాలతో 10 అడుగుల భారీ అద్భుత చిత్రాన్ని భక్తితో 3 రోజులు శ్రమించి చిత్రించారు గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షుడు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డ్ గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం ఈ భూమి మీద అవతరించిన అవతార పురుషుడు శ్రీకృష్ణ భగవానుడన్నారు. భగవంతునికి సేవ చేసుకోవడం పూర్వజన్మ పుణ్యఫలమన్నారు. ఆ భగవంతుడు తనకు ఇచ్చిన కళతో ఎన్నో రకాలుగా ఎన్నో చిత్రాలను చిత్రించానన్నాడు. ఒక చిత్రం చిత్రించాలన్న అందులో లీనమవ్వాలన్నారు. కృషి, పట్టుదల అంతకు మించి ఓపిక ఉన్నట్లయితే సృష్టిలో ఏదైనా సాధించవచ్చున్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల పరిధిలోని పాలమాకుల, రాజగోపాల్ పేట, ముండ్రాయి, బద్దిపడగ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో బుధవారం మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి చిరు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి తన్నీరు హరీష్ రావు సహకారంతో మండల పరిధిలోని వివిధ గ్రామాలలో చిరు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో మంత్రి హరీష్ రావు సహకారంతో వారికి గొడుగులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య సీనియర్ నాయకులు వేముల వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లంకి రవీందర్ రెడ్డి, నాయకులు ఏటి పరమేశ్వర్, ఐలయ్య, పంగ రవి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు వర్దోలు వెంకట్, శామంతుల కనకరాజు, శామంతుల మల్లయ్య, కనకయ్య, ప్రశాంత్, ఇమ్రాన్, సంపత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ప్రయాణికుల సూచనలు సలహాల సేకరణ కోసం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బి సురేఖ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలో ఆర్టీసీ నుంచి అత్యవసరమైన సేవలు ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యలు సలహాలు సూచనలు 9959226270 నెంబర్ కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

ఎర్రోల్ల శ్రీనివాస్‌కు పెండ్లి పత్రిక అందజేత



నవతెలంగాణ-మర్కూక్

మండలంలోని వరదరాజు పూర్ మాజీ సర్పంచ్ లక్కాకుల నరేష్, మండల కో-అప్షన్ సభ్యులు లక్కాకుల సాహేర నరేష్, కుమారుడు లక్కాకుల అఖిల్ రాజ్ వివాహం ఈ నెల 8న శామీర్ పేట మండలంలోని అంతాయిపల్లిలో గల ఎస్.ఎన్.ఆర్.పుష్పకన్వెన్షన్‌లో కలదు. బుధవారం ఆరోగ్య శాఖ మౌలిక సదుపాయాల కల్పన కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్‌ను కో-అప్షన్ సభ్యులు లక్కాకుల సాహేర నరేష్ లు కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు.

తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజీనామా చేస్తా

- మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు, దూళ్మిట్ట మండలాల అభివృద్ధికి తాను కృషి చేస్తుంటే కొంతమంది తనపై సామాజిక మాధ్యమాలలో తప్పుడు పోస్టులు పెడుతూ తన పరువు తీస్తున్నారని. తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజీనామా చేస్తానని మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తోర్నాల గ్రామానికి చెందిన వగలబోయిన శ్రీధర్ అనే వ్యక్తికి సంబంధించిన కుటుంబ భూసమస్య తనపై రుద్దుతూ సామాజిక మాధ్యమాలలో తనపై అవినీతి ఆరోపణలు చేస్తూ పోస్టులు పెడుతున్నాడని. అతనికి చిత్తశుద్ధి ఉంటే తన అవినీతిని నిరూపించినట్లయితే వెంటనే తన పదవికి రాజీనామా చేస్తానని ఆయన తెలిపారు. తన సొంత పార్టీ నాయకులు తనపై కొద్ది రోజుల క్రితం అసత్య ఆరోపణలు చేస్తున్నారని అలాంటి ఆరోపణలు మానుకోవాలని ఆయన కోరారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పని చేయాలి తప్ప ఒక వ్యక్తి కోసం కాదన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దూళ్మిట్ట మండల ప్రజలు తన సొంత ఊరు కాకున్న తనపై నమ్మకంతో ఎంపీటీసీగా గెలిపించి ఎంపీపీ చేశారని దానికి కృతజ్ఞతగా మండల ఏర్పాటులో తన పాత్ర ఎంతో ఉందని గుర్తు చేశారు. ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అవినీతి చేయలేదని ఆయన తెలిపారు. ఎవరికీ ఎలాంటి సందేహాలు ఉన్న నిర్భయంగా సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తీసుకొని ఆరోపణలు చేయాలని ఆయన తెలిపారు. వ్యక్తిగత దూషణ చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తన పరువుకు భంగం కలిగించినట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టిన వగలబోయిన శ్రీధర్‌పై ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఆకుల యాదగిరి, ఎంపీటీసీలు గుజ్జుక సమ్మయ్య, నందన బోయిన నరసింహులు, గుల్ల సత్య కళ, బొప్ప కనకమ్మ,సర్పంచులు జనార్దన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, అంజయ్య,తాళ్లపల్లి రాజమ్మ, జాటోత్ రేణుక కాల్ రాం, రేఖ శ్రీనివాస్, ఉన్నారు.



ఆరు బయట చెత్తను పడేయకు... పడేయనివ్వకు

- మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ సంపత్ కుమార్ మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న అన్ని విభాగాల సిబ్బందికి ఆరు బయట అటు ఇటు చెత్తను పడేయకు, పడేయనివ్వకు (ఫెకొ మత్) పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం బయట తిరుగుతున్న సమయంలో ఎవరో ఒకరు చెత్తను, బిస్కెట్ ప్యాకెట్, కుర్ కురి, చాక్లెట్ కవర్‌లను బయట వేస్తుంటారని, అలా బహిరంగ ప్రదేశాలలో చెత్త వెస్తున్నవారిని వెంటనే ఆపి చెత్త బయట వేయకూడదని అవగాహన కల్పించాలని తెలిపారు. ఒకవేళ ఎవరైనా మీ ముందు బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేస్తా అంటే మీరు ఏం చేస్తారో చూపించాలని వారిచే నాటక దృశ్యం ప్రదర్శింప చేశారు. స్వచ్ఛ సిద్దిపేట కొరకు మంత్రి హరీష్ రావు ఎంతో కృషి చేస్తున్నారని, వారి ఆదేశాలమేరకు ప్రతి రోజూ ఉదయం కౌన్సిల్ సభ్యులు వార్డులలో సైతం నడుస్తూ చెత్త ఏరుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని, మనమంతా స్వచ్ఛ సైనికులమని అన్నారు. కొంత మంది అవగాహన లేక బహిరంగ ప్రదేశాలలో వేస్తున్నారని అలాంటి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆధికారులు మల్లికార్జున్, మేధ, సుధీర్ పులోమియ, స్వచ్ఛ భారత్ కన్సల్టెంట్ , కో ఆర్డినేటర్ , అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ముదిరాజులకు రాజకీయ వాటా దక్కాల్సిందే

- సిద్దిపేటలో త్వరలో భారీ ముదిరాజ్ గర్జన ర్యాలీ
- సన్నాహక సమావేశంలో ముదిరాజ్ సంఘాల నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

ముదిరాజులకు రాజకీయంగా దక్కాల్సిన వాటా అధికార పార్టీ నుంచి దక్కలేదని ముదిరాజుల రాజకీయ వాటా కోసం హక్కుల కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. సిద్దిపేటలోని పెద్దమ్మ దేవాలయం ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ముదిరాజుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలో ఉన్న పార్టీ ప్రకటించిన ఎమ్మెల్యేల లీస్టులో ఒక్క ముదిరాజ్‌కు కూడా అవకాశం ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఆయా నియోజకవర్గాలలో మెజార్టీగా ఉన్న ముదిరాజుల ఓటు బ్యాంకును అధికారం కోసం వాడుకొని ఇప్పుడు కులాన్ని అణగదొక్కాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజులలో చైతన్యం వచ్చిందని ఇప్పటికే ఆయా నియోజకవర్గాలలో ముదిరాజుల నిరసన ర్యాలీలు ప్రారంభమయ్యాయని త్వరలో సిద్దిపేటలో పదివేల మందితో ముదిరాజ్ గర్జన ర్యాలీని చేపడుతామన్నారు. ఈ నిరసన ర్యాలీకి ముదిరాజ్ కుల సంఘాలు యువకులు, మేధావులు ఉద్యోగ సంఘాలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు స్థానిక కౌన్సిలర్స్ బర్ల మల్లికార్జున్, రాజు, ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు మిద్దె రవి, ముదిరాజ్ సీనియర్ నాయకులు జంగిటి శ్రీనివాస్, బైరి శంకర్, ధర్మ ముదిరాజ్ , గట్టు నర్సింలు, పడిగే ప్రశాంత్, బాలకృష్ణ, ముదిరాజ్ జర్నలిస్టు సంఘం నాయకులు రామకృష్ణ, పరమేశ్వర్, సతీష్, శ్రీనివాస్ ,అంకుష్, రవి, బాలేష్, తిరుపతి, సిద్దిపేట నియోజకవర్గంతో పాటు దుబ్బాక గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన సుమారు 300 మంది ముదిరాజులు పాల్గొన్నారు.

9న పెందోట బాల సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం



నవతెలంగాణ-సిద్దిపేట

పెందోట బాల సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం, పుస్తకాల ఆవిష్కరణ ఈ నెల 9వ తేదిన నిర్వహించనున్నామని శ్రీవాణి సాహిత్య పరిషత్ అధ్యక్షులు పెందోట వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో బుధవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా జాతీయ స్థాయి పెందోట బాలసాహిత్య పురస్కారాలను ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సారి ఎనిమిది మంది కవులకు ఇస్తున్నామని తెలిపారు. మంగళంపల్లి రామచంద్రమూర్తి చేర్యాల, డాక్టర్ వాసరవేణి పరుశురాం రాజన్న సిరిసిల్ల జిల్లాలకు విశిష్ట సాహిత్య పురస్కారాలను, శైలజ మిత్రా హైదరాబాద్, డాక్టర్ బి సుధాకర్ సిద్దిపేట, దారం గంగాధర్ నిజామాబాద్ జిల్లా, పెత్రాయుడు కాశీ విశ్వనాథ్ విజయనగరం జిల్లా, వేల్పుల శ్రీలత బాల కవి పెద్దపల్లి జిల్లా, బాలకవి చంద్రశేఖర్ అనంతపురం జిల్లాలకు అందజేస్తున్నామని తెలిపారు. మేలుకొలుపు, బాలసాహిత్య సృజన కారుల పరిచయం, మానవ చిగురులు అనే మూడు పుస్తకాలు కూడా అదే రోజు ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి సంగనభట్ల చిన్న రామకృష్ణయ్య డాక్టర్ కందేపి రాణి ప్రసాద్ సిరిసిల్ల పాల్గొంటున్నారని తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో 9న జరిగే కార్యక్రమానికి సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు, బాల సాహిత్య వేత్తలు, బాలబాలికలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవులు మిట్టపల్లి పరశురాములు, లింగం, శ్రీనివాసు, అనిశెట్టి సతీష్, గంగపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుండారంలో గొర్రెల పంపిణీ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుండారం గ్రామంలో సుమారు 14 మంది లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రెండవ విడత గొర్రెలను పంపిణీ చేశారు. గొర్రెల షెడ్ల నిర్మాణానికి కేటాయించిన భూములను పలువురు కబ్జా చేసుకుని పంటలు సాగుచేస్తున్నారని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. గొర్రెల షెడ్ల నిర్మాణానికి నెలకొన్న సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఎంపీపీ నిర్మల, సర్పంచ్ శెట్టి లావణ్య, ఎంపీటీసీ ఎలుక లత, పశువైద్యాధికారి శ్రీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్నికల లబ్ధికోసమే

రెండవ విడత గొర్రెలను పంపిణీ చేస్తామని లబ్ధిదారుల వద్ద సుమారు రూ.41 వేల జమ చేయించుకుని మభ్యపెట్టి ఆరేండ్ల అనంతరం ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయడం ఎన్నికల లబ్ధికోసమేనని బీఎస్పీ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దోల్ల శ్రీనివాస్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీతో ఒరిగిందేమి లేదని, జనాబా ప్రాతిపదికన చట్టసభల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీజేపీ మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- కేసీఆర్ అఖిల పక్షంను ఢిల్లీకి తీసుకెళ్ళాలి
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మోడీకి లేఖ రాయాలి



నవతెలంగాణ-గజ్వేల్

అత్యవసర పార్లమెంట్ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి, బీజేపీ తాము ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మెన్ వంటెరు ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మదాడి జశ్మంత రెడ్డిలకు సిద్దిపేట జిల్లా ఎమ్మార్పియస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాలను అందజేశారు.. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కో ఇంచార్జి మైస రాములు, ఎం ఎస్ ఎఫ్ జిల్లా ఇంచార్జి సామ్రాట్ ప్రకాష్, ఎం ఆర్ పి స్ జిల్లా అధికార ప్రతినిధి ముక్కపల్లి రాజు మాదిగ సీనియర్ నేతలు పోతగల్లా లింగం, పల్లి పాటి రాజు, పొట్ట కర్ణకర్, స్వామి, మల్లేష్, రాజు తదితులున్నారు.

జిల్లాలో సెర్ప్ కార్యకలాపాలు వేగంగా పూర్తి చేయాలి

- ఓటర్ జాబితా నమోదు ప్రక్రియ తొందరగా పూర్తి చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్



నవతెలంగాణ-సిద్దిపట కలెక్టరేట్

సమీకృత జిల్లా కార్యాలయం సముదాయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ సెర్ప్ అధికారులైన ఎపిఎం, డిపిఎం, శ్రీనిధి సిబ్బందితో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆశించిన మేరకు పనుల్లో పురోగతి లేనందున డిపిఎం ఇతర అధికారులను మందలించారు. జిల్లాలో సెర్ప్ కార్యకలాపాలు స్వయం సహాయక మహిళా సంఘాల జీవనోపాధిలో మార్పు తీసుకురావాలని, అందరు అధికారులు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. మహిళల జీవనోపాధిలో భాగంగా మహిళలు కొత్త ఆలోచనలకు అనుగుణంగా ఆదాయం వచ్చే వనరులను ఎంపిక చేసుకోవాలన్నారు. అలాగే బ్యాంకు లింకేజి, పిఎంఎఫ్ఎంఈ తదితర విషయాల పట్ల అధికారులు ఎక్కువగా దృష్టి సారించాలన్నారు. గ్రామంలో మహిళ సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఓటర్ జాబితా ప్రక్రియలో భాగంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి రమేష్, అడిషనల్ డిఆర్డిఏ పిడి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి బాట లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం

- మూడు రోజుల పాటు కార్యక్రమాలు





నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ మండలం గణేశపల్లి గ్రామంలో వెలసిన శ్రీబాట లక్ష్మీనారసింహస్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 500 సంవత్సరాలకు పూర్వం ఈ ఆలయములో శ్రీ లక్ష్మీనారసింహస్వామి, గనుదాళ్వారు, అంజనేయస్వామి, శివలింగం, కాలభైరవుడి దేవతా మూర్తులకు ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 7న ఉదయం సుప్రభాతసేవ, స్వామి వారికి పంచామృత అభిషేకం, ఆరాధన, మంటపారాధన, అగ్ని ప్రతిష్టాద (హెూమము) ఆవాహిత దేవతా హెూమాలు, మూల మంత్రి పావనములు,స్వామి వారికి రాజభోగము, హారతి, మంత్రపుష్పము, తీర్థ ప్రసాద వితరణ.అనంతరం సాత్రవిధ వేద పారాయణం, శివుడికి మహాన్యాసపూర్వక ఏకధార రుద్రాభిషేకము నామ పారాయణము, హెూమము తదుపరి ఏకాంత సేవ, భజన కార్యక్రమములు. ఈ నెల 8న సుప్రభాతసేవ, స్వామి వారికి పంచామృత అభిషేకం, ఆరాధన, మంటపారాధన, అగ్నిప్రతిష్టాపన (హెూమము), ఆవాహితదేవతా హెూమాలు, మూలమంత్రి పావనములు,స్వామి వారికి రాజభోగము, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ, అనంతరం ద్రవిడవేద పారాయణం, శివుడికి మహాన్యాసపూర్వక ఏకధార రుద్రాభిషేకము, విష్ణు సహస్ర నామ పారాయణము, హెూమము తదుపరి ఏకాంత సేవ, భజన కార్యక్రమం, ఈ నెల 9న ఉళగం, సుప్రభాతసేవ, తిరువారాధన, బాలభోగము, ఆవాహిత దేవతార్చన హవనములు, శ్రీలక్ష్మీనారసింహస్వామి వారి దివ్య సహస్రనామస్తో , మూలమంత్రపావనము, మహాపూర్ణాహుతి ఉ .11 గం.లకు శ్రీబాట లక్ష్మీనారసింహస్వామి వారి శాంతి కళ్యాణము , తీర్థ ప్రసాద వితరణ,మహాదాశీర్వచనము.అన్నదానారాధన. రథోత్సవము (ఊరేగింపు గుడి చుట్టూ) ధ్వజ అవరోహణము, ఏకాంత సేవ, తీర్థ ప్రసాద వితరణ, భజన కార్యక్రమమాలు కలవు.అనంతరం మర్కుక్ జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్ ప ఆద్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించ బడును.ఈ కార్యక్రమాలకు ఆలయ మహారాజ పోషకులు, కే,,శే మణికొండ భూపతి రావు- చంద్రమ్మ ప్రజ్ఞాపూర్ కుటుంబ సభ్యులు, కోత్తూరి రాజు- పుష్ప నీల ఎర్రగడ్డ హైదరాబాదు వారు, ముఖ్య అధితులుగా ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, ఎస్టీడీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి,బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి,ఎంపీటీసి గోలి నరేందర్, గణేష్ పల్లి సర్పంచ్ మెతుకు మంజుల శ్రీరాములు, అంగడి కిష్టాపూర్ సర్పంచ్ దుద్దెడ లక్ష్మి రాములు గౌడ్, ఉపసర్పంచులు పుట్ట మహేష్, కాసుల కొండల్ రెడ్డి, తదితరులు హజరు కానున్నట్లు ఆయన తెలిపారు.ఈ కాళ్యాణ మహెూత్సవ వేడుకలు ప్రజలు,భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని, తీర్థం ప్రసాదములు స్వీకరించి, స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం: మోహన్ పంతులు

శ్రీ బాట లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహెూత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరు. దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించాలని మనవి.

మంత్రి హరీష్ రావును కలిసిన గౌడ సంఘం ప్రతినిధులు



నవతెలంగాణ-కొమురవెల్లి

గౌడ సంఘం ఆధ్వర్యంలో నిత్యాన్నదాన సత్రానికి కేటాయించిన భూమిని వేరొక సంఘానికి కేటాయిస్తున్నారని గౌడ సంఘానికి న్యాయం చేయాలంటూ సంఘం ప్రతినిధులు బుధవారం మంత్రి హరీష్ రావుకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాల క్రితం నిత్యాన్నదాన సత్రానికి కొమురవెల్లి శివారులోని సర్వే నంబర్ 223/11 లో 10 గుంటల స్థలాన్ని అప్పటి ఉన్నతాధికారులు కేటాయించారని వివరించారు. ఆ స్థలాన్ని చదును చేసి బోరు వేసి పలుమార్లు ఆ స్థలంలో గౌడ సంఘ సమావేశాలు కూడా నిర్వహించామన్నారు. తాజాగా ఈ స్థలం మరొక సామాజిక వర్గానికి కేటాయించే ప్రయత్నాలు జరుగుతుండగా హైదరాబాదులో మంత్రి హరీష్ రావును కలిసి సమస్యను వివరించామని వెంటనే మంత్రి స్పందించి గౌడ సంఘం నాయకులకు తగిన న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోకు దెబ్బ జాతీయ కార్యదర్శి ముత్యం నర్సింలు గౌడ్, జిల్లా అధ్యక్షులు స్వామి గౌడ్, మెరుగు కృష్ణ గౌడ్, మోకుదెబ్బ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పచ్చిమడ్ల స్వామి గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని నర్సింలు గౌడ్,తాళ్లపల్లి రాజు గౌడ్, బుడిగే గురువయ్య గౌడ్, ముత్యం పర్శరములు గౌడ్,ముత్యం విజయ్ కుమార్ గౌడ్, శివలింగు రమేష్ గౌడ్ కొయ్యడ నరేష్ గౌడ్, పచ్చిమడ్ల కనకయ్య గౌడ్, బూరుగు శ్రీనుగౌడ్, పచ్చిమడ్ల ఐలయ్య, పచ్చిమడ్ల ఎల్లయ్య, పచ్చిమడ్ల శ్రీను, మెరుగు బాలరాజు బూర్గు శీను, తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

సిద్దిపేటకు ఓ న్యాయం అక్కన్నపేటకు మరో న్యాయమా?





నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసాగా కొనసాగింది. సర్పంచులంతా బిల్లులు రావడంలేదని ఎంపీడీవో సత్యపాల్ రెడ్డిని నిలదీశారు. ఈ సందర్భంగా కేశ్ నాయక్ తండా సర్పంచ్ రవీందర్ మాట్లాడుతూ సర్పంచ్‌గా గెలిచి మేము సిగ్గుపడుతున్నామని కనీసం బిల్లులు రాక సిబ్బందికి జీతాలు చెల్లించలేక తలెత్తుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త గ్రామపంచాయతీలు మెయింటెనెన్స్ చేయడమే ఎంతో కష్టంగా మారిందని, వాటికి తోడు ట్రాక్టర్ ఈఎంఐలు ఏ విధంగా కడతామని అధికారులను ప్రశ్నించారు. కొత్త గ్రామ పంచాయతీలకు సంబంధించి ప్రభుత్వం ఏదైనా సహకారం అందించాలని కోరారు. కుందన్ వాన్ పల్లి సర్పంచ్ దినేష్ రెడ్డి మాట్లాడుతూ ఊళ్లో గ్రామసభ పెట్టాలంటేనే భయంగా ఉందని వందలాది మంది ప్రజలు పింఛన్లు, రేషన్ కార్డులు రావడంలేదని ప్రశ్నిస్తున్నారని తెలియజేశారు. కొన్ని నెలల నుంచి బిల్లులు రాక ఊళ్లో తిరగలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అక్కన్నపేట సర్పంచ్ సంజీవరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే భార్యల పుస్తెలమ్మి ఊళ్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని, ఇక అమ్ముకోవడానికి ఏమీ లేవని అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని సర్పంచులకు బిల్లులు చెల్లిస్తున్నారు కానీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట సర్పంచులకు బిల్లులు ఎందుకు రావడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి బీలు నాయక్, జడ్పిటిసి భూక్యమంగా, అక్కన్నపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెసరి సాంబరాజు, ఎమ్మార్వో సంజీవ్ కుమార్, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | సెప్టెంబర్ 07 2023 | www.navatelangana.com

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు దక్కించుకున్న జ్ఞానేశ్వరి



నవతెలంగాణ-ములుగు

ములుగుకు చెందిన జ్ఞానేశ్వరికి రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా రాష్ట్ర కార్యాలయం గురుకుల కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ ఐఏఎస్ చేతుల మీదుగా మంగళవారం అవార్డును అందించారు. 2019 లో ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజ్ దేవరకొండ నందు విధులు నిర్వహిస్తున్నందున జీపి జ్ఞానేశ్వరి చేసినటువంటి సేవల గుర్తింపుగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా అవార్డు దక్కింది. ఆమె మాట్లాడుతూ శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుంది అనే నానుడి నా విషయంలో నెరవేరిందని రాష్ట్ర ప్రభుత్వం నా శ్రమను గుర్తించి ఈ అవార్డు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె అన్నారు.

జనగామ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొంగోని సురేష్‌గౌడ్ దరఖాస్తు



నవతెలంగాణ-మద్దూరు

జనగామ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీజేవైఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మద్దూరు మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ బొంగోని సురేష్ గౌడ్ బుధవారం దరఖాస్తు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగాపడ్డ పాలనను ప్రాలద్రోలదానికి ఇన్నేండ్లు దోపిడికి గురైన జనగామ నియోజకవర్గాన్ని రక్షించడానికి బిజెపి తరఫున ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న నియోజకవర్గ రూపురేఖలు మార్చడానికి, కబ్జాకోర్ల చెర నుండి మన జనగామకి విముక్తి కల్పించడానికి జనగామ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు అధిష్టానం తనకు జనగామ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

సీఎం ఇలాకలో ఉవ్వెత్తున బీసీ రాగం

- అధికార పార్టీలో చలనం





నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో బీసీ రాగం ఉవ్వెత్తున లేస్తోంది. గజ్వేల్ వేదికగా బీసీ కులాల ఐక్యవేదిక కమిటీ ఏర్పడి పార్టీలకతీతంగా గత మూడు నెలలుగా నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో కమిటీ పర్యటిస్తూ మండల కమిటీలను, గ్రామ కమిటీలను, ఏర్పాటు చేస్తుంది. మంగళవారం గజ్వేల్ లో నిర్వహించిన బీసీ కులాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశానికి నియోజకవర్గం నుండి ఏడు మండలాల నుండి భారీ సంఖ్యలో అన్ని కులాలకు చెందిన కుల సంఘాలు, ఆయా కులాల సభ్యులు రౌండ్ టేబుల్ సమావేశంలో తమ వాదాన్ని బలంగా వినిపించారు. దీంతో అధికార పార్టీలో ప్రెస్ మీట్ లు పెట్టి చెప్పించే స్థాయికి చేరిందంటే ఇంటిలిజెన్స్ వర్గాలు అధికార పార్టీకి సమాచారాన్ని బలంగా పంపారని తెలుస్తుంది. . గజ్వేల్ ప్రాంతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యమైన గజ్వేల్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అధికార పార్టీ పై ఎలాంటి విమర్శలు చేయలేకపోయినా అధికార పార్టీలో మాత్రం కదిలిక వచ్చింది. బీసీలకు తెలంగాణ ప్రభుత్వం న్యాయం చేస్తుందని స్థానిక నాయకులు చెప్పుకొచ్చారు. పదవులు ఉన్నప్పుడు బీసీ రాగం గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ఇది వాస్తవం పదవులు ఉన్నప్పుడు ఏ ఉద్యమం, ఏ రాగాలు బయటకు రావు. ఇది గజ్వేల్ బీసీ కులాల ఐక్యవేదిక కమిటీ ఒకటే కాదు, ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు కూడా కారణం ఏమిటో అధికార పార్టీ నాయకులకు చెప్పవలసిన అవసరం లేదు. ప్రతి నాయకుడికి పదవి, హెూదా లేనప్పుడు ఏదో ఒకటి ముందుకు వేసుకుంటారు. అందులో నుండే తెలంగాణ రాష్ట్ర సమితి అవర్భవించిందని గజ్వేల్ బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు అంటున్నారు. బీసీ కులాలకు రావాల్సిన రిజర్వేషన్ల ప్రకారం తమాషా ప్రకారం చట్టసభల్లో ప్రాధాన్యత ఇవ్వడం లేదని ,ఇది ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న నేపథ్యంలో ఉద్యమాన్ని ఇక్కడినుండే ప్రారంభించాలని ముఖ్యంగా నియోజకవర్గంలో బలోపేతం చేసిన తర్వాత బయట ప్రాంతాలపై దృష్టి పెట్టాలని స్థానిక బీసీ కులాల ఐక్యవేదిక నిర్ణయించుకుంది. మూడు నెలలుగా జరుగుతున్న కార్యక్రమాలో ఎక్కడ కూడా అధికార పార్టీపై ఇతర పార్టీలపై విమర్శలు చేయలేదు. కేవలం బీసీలకు జరుగుతున్న అన్యాయంపైనే చర్చించారు. కొందరు అగ్రవర్ణాలు కావాలని బీసీ కులాల ఐక్యవేదికపై అధికార పార్టీ తో విమర్శలు చేయించినట్లు వారు పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గం లో రెండు లక్షల 70 వేల ఓట్లు ఉండగా ఇందులో బీసీలు 1,50,000 ఉన్నాయని వారికి గుర్తు చేశారు. చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ లో జరుగుతున్న బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సభలు సమావేశాలు రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రముగా జరుగుతున్న బీసీల ఉద్యమం పై ఇంటిలిజెన్స్ వర్గాలు కూడా ఎప్పటికప్పుడు నిఘా విభాగం అధికారులు సమాచార తెలుసుకుంటున్నాయి. నియోజకవర్గంలోని 177 గ్రామాల నుండి ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన అంటే బీసీ నినాదం ఎంతవరకు వెళ్లిందో వేరే చెప్పనక్కర్లేదు. అవసరమైతే పార్టీలో కూడా రాజీనామాలు చేసి రంగంలో దిగేందుకు ముఖ్య నేతలు అంతా నియోజకవర్గంలో సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో జడ్పీటీసీలు ,ఎంపీపీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు వివిధ హెూదాలో ఉన్న నాయకులు కార్యకర్తలు అవసరమైతే రాజీనామాలు చేద్దామని చర్చించుకుంటున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా గజ్వేల్ లో నిర్వహించిన బీసీ కులాల ఐక్యవేదిక కార్యక్రమాలు అధికార పార్టీలో కదిలికల తెచ్చాయి.

ఆలయ చైర్మన్ హెూదాలో మీటింగ్‌కు పులిహెూర ప్యాకెట్లు వాడుకోవచ్చు

- ఆలయం వద్ద నిజాయితీగా పని చేస్తున్నా
- ఆలయ చైర్మన్ గీస భిక్షపతి



నవతెలంగాణ-కొమురవెల్లి

ఆలయ చైర్మన్ హెూదాలో మీటింగ్‌కు పులిహెూర ప్యాకెట్లు వాడుకోవచ్చుని, తాను వాడుకోలేదని చైర్మన్ గీస భిక్షపతి అన్నారు. బుధవారం ఆలయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'చైర్మన్ హెూదాలో మీటింగ్‌కు పులిహెూర ప్యాకెట్లు వాడుకోవచ్చు. నేను మాత్రం వాడుకోలేదు. ఒకరోజు ముందే పులిహెూర ఇన్చార్జికి డబ్బులు ఇచ్చి పులిహెూర తీసుకుంటానని చెప్పాను' అని తెలిపారు. పదిహేను వందల పులిహెూర ప్యాకెట్లు దొంగ చాటున తీసుకోవాల్సిన అవసరం తనకు లేదన్నారు. చైర్మన్ పదవి చేపట్టిన నాటినుండి ఆలయంలో అనేక అవినీతి అక్రమాలను అరికట్టి రెండు సంవత్సరాల్లో అనేక అభివృద్ధి పనులతో పాటు ఏడు కోట్లకు పైన దేవాలయానికి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపట్టానని తెలిపారు. నిజాయితీతో పని చేస్తున్నానని చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభించిన కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మి కనకయ్య



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని మూడో వార్డులో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన 2 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ప్రారంభించిన స్థానిక కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మి కనకయ్య వార్డులో లో ఓల్టేజ్ సమస్యతో బాధపడుతున్న సందర్భంగా మూడో వార్డు ప్రజల విజ్ఞప్తి మేరకు 2 నూతన ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. వార్డు సభ్యుల విద్యుత్ సమస్యను తొలగించి నూతన ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి సహకరించిన విద్యుత్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ,విద్యుత్ లైన్ మెన్ ,బి ఆర్ ఎస్ పార్టీ వార్డ్ అధ్యక్షులు శ్రీరామ్ మల్లేశం,బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు కదుల్ల ఎల్లేశం,బి ఆర్ ఎస్ నాయకులు వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి ఘన సన్మానం



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే మహిళ డిగ్రీ కళాశాలలోని బయో కెమిస్ట్రీ ఆధ్యాపకురాలిగా పని చేస్తున్న ఉష రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యపకురాలిగా ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం వారికి శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.జి భాస్కర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యపకుల్లో తమ కళాశాల నుండి ఒకరు ఎన్నిక కావడం తమకు ఎంతో గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. గోవింద రావు, కె. భాగ్యలక్ష్మి గారు, అధ్యాపక బృందం మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏఎంసీ డాట ఎంట్రీ ఆపరేటర్‌ను పరామర్శించిన నాయకులు



నవతెలంగాణ-తొగుట

తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగి సునీల్ తండ్రి దానయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య,మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, చందాపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింలు బుధవారం హైదరాబాద్ లో ఆయన అంత్యక్రియల్లో పాల్గొని నివాళి అర్పించారు.కుమారుడు సునీల్‌ను వారు పరామర్శించారు. పరామర్శించిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మ్యాడల కిరణ్ కుమార్ రెడ్డి,నందారం నరేందర్ గౌడ్,చిలువేరి రాజిరెడ్డి, దుబ్బాక కనకయ్య,బిక్కనూరి సంతోష్, ఈదుగాళ్ల పర్శరాములు,సత్యం,రాంబాబు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన బొల్లి శంకర్, వొడ్నాల సువర్ణ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అందవేని రమేష్, ప్రధాన కార్యదర్శి మౌటం రాజు, బోనగిరి రాములు, బొల్లి కొమురయ్య, బొల్లి శ్రీనివాస్, అంజిరెడ్డి, పున్నం శేఖర్, నక్క మధు, హరి, సంతోష్, గౌరవెని అరుణ్, బొల్లి తరుణ్, పున్నం అజయ్, దామరపల్లి రంజిత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రక్తదానం చేద్దాం.. ప్రాణాలను కాపాడుదాం



నవతెలంగాణ-రాయపోల్

రక్తదానం మహాదానం అన్ని దానాలలోకెల్లా రక్త దానం చాల గొప్పది. ప్రాణాలు కోల్పోయే స్థితి నుండి ఎంతోమంది ప్రాణాలను రక్షించవచ్చు. రక్తదానం చేయ డంవల్ల కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చు.ఈ మాటలకు ఆదర్శంగా నిలిచారు యువ జర్నలిస్ట్ యాదగిరి . బుధవారం పీవీ నరసింహారావు చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ గజ్వేల్ లక్ష్మక్క పల్లి ఆర్విఎం ఆస్పత్రిలో బీ నెగటివ్ పాజిటివ్ రక్తం అత్యవసరం ఉందని ఫోన్ ద్వారా వచ్చిన సమాచారానికి స్పందించి వెంటనే బ్లడ్ బ్యాంక్ వెళ్లి యాదగిరి రక్తం దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రాంతంలోనైనా కులమత బేధాలు లేకుండా ఎవరికైనా సరే అత్యవసర సమయంలో రక్తం అవసరం అనే సమాచారం తెలిస్తే రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలన్నారు. ఓ పేషెంట్ కి అత్యవసరంగా బీ నెగటివ్ రక్తం అవసరం ఉందని తెలియగానే వెంటనే వెళ్లి రక్తదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చాలామంది రక్తదానం చేయడం వలన అనారోగ్యానికి గురవుతామని అపోహ పడతారని దీనివల్ల రక్తదానం చేయడానికి ముందుకు రాలేకపోతున్నారు. కానీ వాస్తవానికి రక్తం దానం చేయడం వలన ఎలాంటి అనారోగ్యానికి గురికామన్నారు. మన శరీరంలో ఉండే పాత రక్త కణాలు తొలగిపోయి కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతాయని వాటి ద్వారా ఉత్సాహంగా ఆరోగ్యంగా ఉంటామన్నారు. అత్యవసర సమయంలో రక్తదానం చేయడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఎంతో మంది ప్రాణాలు రక్షించడానికి వీలుంటుందని అలా మన ద్వారా రక్తాన్ని స్వీకరించిన వారు కోలుకొని వారి ముఖములో వ్యక్తం చేసే సంతోషం గొప్ప వరంలాంటిదన్నారు.

సిద్దిపేట టు తిరుపతి, బెంగుళూర్ రైలు



నవతెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట నుండి తిరుపతి, బెంగళూర్ కు రైళ్ల ప్రారంభించడంతో పాటు, ప్యాసింజర్ రైలు నడపాలని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎంను కోరారు. బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లాలో రైల్వే పెండింగ్ పనుల అంశంపై సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ను కలిశారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగా నిర్మించిన సిద్దిపేట రైల్వే లైన్ ఈ నెల 15 న రైల్వే సేఫ్టీ కమిషనర్ ఇన్స్పెక్షన్ పూర్తి కాగానే ప్యాసింజర్ రైళ్లను ప్రారంభించాలని కోరారు. అదే విధంగా హైదరాబాద్ నుండి సిద్దిపేట కి పుష్ పుల్ రైల్ ను కూడా ప్రత్యేకంగా ప్రారంభించాలన్నారు. పటాన్‌చెరు ఎదులనాగులపల్లిలో గూడ్స్ టెర్మినల్ త్వరగా పూర్తి చేయాలని కోరారు. కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద కొత్త రైల్వే స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. మాసాయిపెట్ రైల్వే పెండింగ్ పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని కోరారు. దేశ చరిత్రలోనే అత్యంత త్వరితగతిన సిద్దిపేట రైల్వే లైన్ పూర్తి అయిందంటే రాష్ట్ర ప్రభుత్వం వేగంగా భూ సేకరణ చేసి రైల్వే శాఖకు ఇవ్వడం వల్లే సాధ్యమైందని అన్నారు. దేశం లో మొట్టమొదటిసారి ఒక్క కోర్టు కేసు కూడా లేకుండా ఈ ప్రాజెక్టు పూర్తి చేయగలిగామని, తెలంగాణలో నిర్మించనున్న ఔటర్ రింగ్ రైల్వే ప్రాజెక్ట్ లో మెదక్, సిద్దిపేటను కలపాలని కోరారు. రూ. 250 కోట్లతో 2 వేల ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ చేసి రైల్వే శాఖకు ఇచ్చామని అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.315 కోట్లు నిధులు కూడా సమయానికి విడుదల చేయడం వల్ల సిద్దిపేట రైల్వే లైన్ పూర్తి అయిందని మంత్రి అన్నారు. చేగుంట మెదక్ రోడ్డు లో నూతన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు వచ్చిన నేపథ్యంలో టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి జీఎం ను కోరారు. అన్ని విజ్ఞప్తిలపై సానుకూలంగా స్పందించిన జీఎం అరుణ్ కుమార్ జైన్ ప్రతిపాదనలను వెంటనే రైల్వే బోర్డ్ కి పంపిస్తాం అన్నారు. రైల్వే బోర్డ్ నీ కూడా త్వరలో కల్వనున్నట్లు మంత్రి తెలిపారు.

ఒకే భవనంలో మూడు కళాశాలలు





నవతెలంగాణ-చేర్యాల

ఒకే భవనంలో మూడు కళాశాలలు, ఉండి వసతులు నాణ్యమైన విద్య లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేర్యాల మండల కేంద్రంలోని గాంధీ చౌక్ ఆవరణలో ఉన్న సాధన జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం అదే కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ప్రస్తుతం ఉన్న సాధన కళాశాలను యాజమాన్యం కొత్త బస్టాండు సమీపంలో ఉన్న విజేత కళాశాల భవనంలోకి మార్చిడి చేశారు. ఒకే భవనంలో మూడు కళాశాలలు ఉండడం ఏంటని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేసారు.అక్కడ సరైన వసతులు లేవని మేము అక్కడే క్లాసులు వింటామంటూ విజేత కళాశాల భవనం ఎందుట విద్యార్థులు నిరసన చేపట్టారు. కళాశాలకు వచ్చిన విద్యార్థులను ఆ భవనంలోకి వెళ్లాలాంటు యాజమాన్యం విద్యార్థులను వత్తిడి చేయడం తో అక్కడికి వెళ్ళమంటూ కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు.విజేత కళాశాల లోకి వెళ్తేనే క్లాస్ లు చెబుతమంటూ సాధన కళాశాల యాజమాన్యం , సిబ్బంది ఘాటుగా సమాధానం చెప్పడంతో విద్యార్థులందరు బలవంతంగా విజేత కళాశాలకు వెళ్లారు.విద్యార్థులకు సౌకర్యాలతో పాటుగా నాణ్యమైన విద్య అందే విదంగా ఏర్పాట్లు చేస్తామని కళాశాల యాజమాన్యం చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. అలాగే విద్యార్థులకు కళాశాలలో ఇబ్బందులు ఎదురైతే వాళ్లు కోరుకున్నట్టుగా వారి యొక్క సర్టిఫికెట్లు ఇస్తానని యాజమాన్యం హామీ ఇచ్చింది.

అంతర్ జిల్లా పోలీస్ స్టేషన్ అధికారుల ప్రత్యేక సమావేశం



నవతెలంగాణ-దుబ్బాక

వచ్చే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల సరిహద్దు పోలీస్ స్టేషన్ల అధికారులు దుబ్బాక పురపాలిక కేంద్రంలోని సర్కిల్ ఇన్ స్పెక్టర్ కార్యాలయంలోబుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నికల దృష్ట్యా పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా,సరిహద్దు స్టేషన్ల పరిధిలో పరస్పర సహకారం, సరిహద్దుల్లో చెక్ పోస్టుల ఏర్పాటు వంటి పలు అంశాలపై చర్చించారు.సిద్దిపేట అడిషనల్ డిసిపి అడ్మిన్ ఏ.శ్రీనివాస్ రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశానికి సిద్దిపేట ఏసీపి,సురేందర్ రెడ్డి, సిద్దిపేట ,దుబ్బాక నోడల్ అధికారి ఏసిపి చంద్రశేఖర్, గజ్వేల్ ఏసిపి రమేష్, తూప్రాన్, కామారెడ్డి, మెదక్ డిఎస్ పి లు యాదగిరి రెడ్డి, ఆర్.ప్రకాష్, సిహెచ్.ఆర్వి వుదర్ లతో కలిసి పలు కీలక అంశాలను చర్చించారు.దుబ్బాక,తొగుట,భిక్ నూర్,సిరిసిల్ల రూరల్ సీఐలు మున్నూరు కృష్ణ,బి.కమలాకర్, తిరుపతయ్య,సాధన్ కుమార్, దుబ్బాక, భూంపల్లి, ముస్తాబాద్, దౌల్తాబాద్, నిజాంపేట్, రామయంపేట్, బిబిపేట్ ఎస్ ఐ లు వి.గంగరాజు, భువనేశ్వర్, కే.శేఖర్, చైతన్య, కే.శ్రీనివాసరెడ్డి, బి.రంజిత్, హెచ్.సాయి రెడ్డి పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.


నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి




నవతెలంగాణ-చేర్యాల

బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం)చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో డిమాండ్ చేశారు. పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం తహసీల్దార్ జోగినిపల్లి రాజేశ్వర్ రావు కు పలు డిమాండ్ల కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట మావో మాట్లాడుతూ రోజురోజుకు నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల పైన మోయలేని భారాలు మోపుతున్న దాన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమాన్ని మరిచి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ సంస్థలన్నింటినీ ప్రైవేటు బడా కార్పొరేటు, గుత్తాధిపతులకు ధారాధత్వం చేస్తూ ప్రజల మీద విపరీతమైన భారాలు మోపుతుందన్నారు. దేశ సంపదనంతా అదాని, అంబానీ, టాటా, బిర్లా లాంటి కోటీశ్వరులకు చేరే విధంగా ప్రజా వ్యతిరేక విధానాలను రూపొందిస్తూ, ప్రజాసంక్షేమం కోసం ఉపయోగపడే సేవా రంగాలైన విద్యా, వైద్యం, విద్యుత్తు తదితర రంగాలన్నింటినీ ఒక్కొక్కటిగా ప్రైవేటు పరం చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు విద్యా, వైద్యాన్ని దూరం చేస్తున్నాయని, పేదలు, మధ్యతరగతి కుటుంబీకులు, కార్మికులు, రైతులు ఈ మోడీ ప్రభుత్వ విధానాల వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు పెంచి జిఎస్టి పేరుతో ప్రభుత్వ ఖజానా నింపుకుంటూ ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే మానుకొని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ను పటిష్ట పరిచి 14 రకాల నిత్యవసర సరుకులను పేదలకు సబ్సిడీ ధరలపై పంపిణీ చేయాలన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, కార్మికుల కు కనీస వేతనాలను, రైతులు పండించే పంటలకు మద్దతు ధరను ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ ప్రాంతాల మధ్యన హిందూ, ముస్లిం, క్రైస్తవులు, గిరిజనులు, దళితుల మధ్య చిచ్చులు లేపి ప్రధాని నరేంద్ర మోడీ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు.రాబోయే రోజుల్లో బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పేద, మధ్యతరగతి, కార్మిక వర్గం రైతులను, మేధావులను, ప్రజాతంత్ర వాదులను ఏకం చేసి పోరాటాన్ని బలోపితం చేస్తామని,పార్టీ నిర్వహించే ఈ పోరాటంలో పార్టీలకతీతంగా భారతదేశ భవిష్యత్తు ను కార్పొరేట్లపరం కాకుండా కాపాడు కొనేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్టీ చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, నాయకులు ఆముదాల నర్సిరెడ్డి, పోలోజు శ్రీహరి, బోయిని మల్లేశం, గొర్రె శ్రీనివాస్, పొనుగోటి శ్రీనివాస్ రెడ్డి, కాశెట్టి ఆంజనేయులు, ఎండి. కరీం, పున్నమినా, సిద్ధులు, ఆముదాల రంజిత్ రెడ్డి, తొడంగల రామచంద్రం, గుండ్ర రవీందర్, చెట్కూరి భీమరాజు, బ్రహ్మయ్య నారాయణ పాల్గొన్నారు.

సరస్వతీ గ్లోబల్ స్కూల్లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు







నవతెలంగాణ-దుబ్బాక, దుబ్బాక రూరల్

దుబ్బాక పట్టణంలోని సరస్వతి గ్లోబల్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు రమేష్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులు శ్రీ కృష్ణ గోపికల వేషధారణలతో అలరించగా... ఈ వేడుకలు సంతోషకరంగా జరిగాయనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని విద్యార్థులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు మాలే రమేష్ ,కరస్పాండెంట్ కనకా రెడ్డి, ఉపాధ్యాయులు బాబా ,యాదగిరి ,రాజు, సంధ్యారాణి, మానస తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

నవభారత్‌లో కృష్ణాష్టమి వేడుకలు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడి, గోపికల వేషధారణలు వేశారు. పాఠశాలలో విద్యార్థులు ఉట్టి కొట్టారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గంగరవేణి రాజు, ప్రిన్సిపల్ వినీష్ , ఇన్చార్జి ఉపాధ్యాయురాలు జయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-రాయపోల్

బడుగు బలహీన వర్గాలకు చేదోడు వాదోడుగా ఉంటూ నిరుపేద ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజా నాయకుడిగా వెలుగొందుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ జన్మదిన వేడుకలు రాయపోల్ మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతకింది మంజుర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో రెండోసారి ఎమ్మెల్సీగా పదవి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ జిల్లా వ్యాప్తంగా నిరు పేద ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎప్పుడు ఆయన ఒకే మాట చెబుతూ ఉంటారని ఎన్ని డబ్బులు సంపాదించిన మన వెంట తీసుకెళ్లలేమని బ్రతికినన్ని రోజులూ పేద ప్రజలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందన్నారు. ఆ సేవా కార్యక్రమాలే మనం చనిపోయిన తర్వాత కూడా మనల్ని బతికిస్తాయన్నారు. అలాంటి ఉదారత భావం కలిగిన ఫారూఖ్ హుస్సేన్ ఏప్పటికీ ఇలాగే నిరుపేదలకు సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డైరెక్టర్ మురళి,బీఆర్ఎస్ నాయకులు జనార్దన్ రెడ్డి,స్వామి,రాజు, కరుణాకర్, నవీన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా సీఎం కేసీఆర్

- 3 వార్డు కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మీ కనకయ్య.



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

సీఎం కేసీఆర్ చొరవతో గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా అభివృద్ధి సాధించిందని మూడవ వార్డు కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్ అన్నారు. శనివారం వారు నవతెలంగాణ తో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ 2014లో గజ్వేల్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు అన్నారు. సీఎం అయ్యాక తొమ్మిదేళ్లలో అభివృద్ధిలో 90 ఏళ్ల ముందుకు తీసుకువెళ్లారన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అంటే సీఎం మున్సిపాలిటీ అనే అంతగా అభివృద్ధి సాధించిందన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి సీఎం అయిన ఘనత బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ కి దక్కుతుందన్నారు. మూడోసారి గజ్వేల్ అసెంబ్లీ నుండి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్ ని లక్ష మెజారిటీతో విజయకేతనం ఎగురవేస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో గజ్వేల్ మున్సిపాలిటీ దేశానికి ఆదర్శంగా నిలిచింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. సీఎం కేసీఆర్, గడ ప్రత్యేక నిధులతో రాష్ట్రంలోనే గజ్వేల్ చెప్పలేనంత అభివృద్ధి చెందిందన్నారు. ప్రతిపక్షాలకు విమర్శించే ఛాన్స్ లేకుండా అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు.

సూచిక బోర్డు లేక ఇబ్బందులు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు ఈ మధ్యకాలంలోనే పూర్తి అయిపోయి గుడాటి పల్లి గ్రామానికి వెళ్లాల్సిన దారులను పూర్తిగా మూసేశారు. రామవరం నుంచి హుస్నాబాద్‌కు వచ్చే పాతదారిని మూసివేయడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో బుధవారం రామవరం రోడ్డు నుంచి వస్తున్నటువంటి ఒక లారీ డ్రైవర్ నేరుగా అది హుస్నాబాద్ కు వెళ్లే రూట్ అనుకుని డైరెక్ట్ గా డ్యామ్ లోకి వెళ్లిపోయారు. సడన్ గా అక్కడ నీళ్లు కనిపించడంతో ఏదైనా వాగు కావచ్చని అది దాటాక మళ్లీ రోడ్డు ఉంటుంది కావచ్చు అని భావించారట. అలా ఎంత దూరం వెళ్లిన నీళ్లు ఎక్కువ కావడంతో లారీ ఆగిపోయింది. దీంతో లారీ డ్రైవర్ ఆ నీటిలో చిక్కుకున్నాడు. ఇది గమనించినటువంటి రామవరం గ్రామస్తులు ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్ కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఎంపీటీసీ జెసిబి సహాయంతో లారీని, డ్రైవర్ బయటకు రప్పించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ.. గుడాటిపల్లికి వెళ్లే రూట్ ను పూర్తిగా మూసివేయాలని, అంతేకాకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేసి గూగుల్ నుంచి ఆ మ్యాప్ ను తొలగించి, కొత్త రూట్ మ్యాప్ ను ఎంటర్ చేయాలని అధికారులను కోరారు. ఈ సహాయ కార్యక్రమంలో రామవరం గ్రామస్తులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ పట్టుదలతో మున్సిపల్ అభివృద్ధి


- 4 వ వార్డు కౌన్సిలర్ పంబాల అర్చన శివకుమార్



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

సీఎం కేసీఆర్ పట్టుదల కృషి ఫలితమే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధి సాధించిదని నాలుగో వార్డ్ కౌన్సిలర్ పంబాల అర్చన శివకుమార్ అన్నారు. బుధవారం వారు నవ తెలంగాణతో మాట్లాడుతూ అభివృద్ధికి నోచుకోని తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యంతో అభివృద్ధి సాధించిందన్నారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా సీఎం కేసీఆర్ కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఎడ్యుకేషనల్ హబ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మహతి ఆడిటోరియం, వంద పడకల హాస్పిటల్, వంద పడకల మత,శిశు హాస్పిటల్ అర్బన్ పార్క్, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్, మోడల్ వైకుంఠధామం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్ అభివృద్ధి చెందాయన్నారు. సీఎం కేసీఆర్ 9 ఏళ్లలో వందల కోట్ల నిధులతో గజ్వేల్ ని రాష్ట్రానికి రోడ్డు రోల్ మాడల్ గా తీర్చిదిద్దారన్నారు. హరితహారంతో హరిత తెలంగాణ విజయవంతంగా పూర్తి చేశారన్నారు. రాబోయే రోజుల్లో బంగారు తెలంగాణలో ప్రతి ఒక్కరు భాగస్వాములై, సంపూర్ణ తెలంగాణను సాధించేందుకు కృషి చేయాలన్నారు.మూడవ సారి సీఎం కేసీఆర్ ని గజ్వేల్ నుండి లక్ష మెజారిటీతో గెలిపిస్తామన్నారు.

పిడుగుపాటుకు గేదె మృత్యువాత



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని ఆరెపల్లి గ్రామ రైతు పకిడ రాజుకు చెందిన గేదె మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగుపాటుకుగురై మృత్యువాత చెందింది. సుమారు రూ.70 వేల విలువైన గేదెను నష్టపోయానంటూ బోరున విలపించాడు. వ్యవసాయంపై ఆధారపడి జీవనాన్ని గడుపుతున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జాయ్ ఇంటరేషనల్ స్కూల్ డైరెక్టర్ సతీష్, ప్రిన్సిపాల్ స్మిత భోగరాజు మాట్లాడుతూ.. నేటి విద్యార్థులు రేపటి భావి తరాలని, వారిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నందుకు అభినందనీ యమన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్లో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు ఉపాధ్యాయ బృందం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణుల వేషధారణలో విద్యార్థులు పలువురుని ఆకట్టుకున్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయంటూ జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ స్మిత భోగరాజు, వైస్ ప్రిన్సిపాల్ నాగమణి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయిన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు రాఘవేందర్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న రాఘవేందర్‌ను సంగారెడ్డి సెయింట్ మేరీస్ గ్రామర్ హై స్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. మెదక్ జిల్లా శంకరంపేట్ మోడల్ స్కూల్‌లో మాథ్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గురు ప్రసాద్, బంగారు కృష్ణ మాట్లాడుతూ.. క్లిష్టమైన మాథ్స్ సబ్జెక్టును విద్యార్థులకు అర్థం అయ్యే విధంగా బోధించి వారి అభివృద్ధికి రాఘవేందేర్ కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఉత్తమ అవార్డు గ్రహిత రాఘవేందేర్ మాట్లాడుతూ.. ఏ వృత్తిలో లేని సంతృప్తి ఒక్క ఉపాధ్యాయ వృతిలోనే ఉంటుందన్నారు. తమ దగ్గర చదువు పూర్తి చేసిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం రోజున పూర్వ విద్యార్థులు తమ సేవలను గుర్తు పెట్టుకొని సన్మానించడం మంచి సంస్కార మన్నారు. ఈ కార్యక్రమంలో గంగేరి శ్రీనివాస్, రవి, శైలేష్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి.. బీజేపీ మాట నిలబెట్టుకోవాలి



నవతెలంగాణ-జహీరాబాద్

ఈనెల 18నుంచి జరగబోయే అత్యవసర పార్లమెంట్ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి.. గతంలో బీజేపీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు అబ్రహం మాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మేరకు బుధవారం జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, అలాగే కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులైన మహ్మద్ ముల్తానీ, బీజేపీ జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డిలకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి, సంగారెడ్డి జిల్లా ఇంచార్జీ బొర్ర భిక్షపతి మాదిగ ఆధ్వర్యంలో వినతి పత్రాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సంగారెడ్డి జిల్లా కో-కన్వీనర్ మాతంగి చిరంజీవి, జహీరాబాద్ ఎమ్మెస్పీ కన్వీనర్ జయరాజ్, ఎం.ఆర్.పి.యస్ సీనియర్ నాయకులు ఉల్లాస్, సుకుమార్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

వివిధ పాఠశాలల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ఆచార్య పాఠశాల, నారాయణ పాఠశాల, కృష్ణవేణి, మాణిక్ ప్రభు, బసవేశ్వర పాఠశాలల్లో విద్యార్థులు కృష్ణ, గోపిక అవతారాలతో పాఠశాలలకు వచ్చి నృత్యాలతో ఆలరించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి ,శ్రీశైలం, మోజెస్, వెంకటయ్య, స్వరూపాలు విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

జిన్నారంలో నేడు విశ్వ గురువు శిబిరం

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలోని స్థానిక కోదండ రామాలయంలో గురువారం విశ్వ గురువు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కమ్మరి విష్ణుమూర్తి తెలిపారు. సనాతన ధర్మంపై ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయం చైర్మెన్ భోజిరెడ్డి పాలకవర్గం ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిన్నారం ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యార్థులకు ఓటు నమోదు, ఓటు హక్కు ప్రాముఖ్యతలపై అవగాహన కలిగించేందుకు జిల్లాలోని అన్ని కాలేజీలు, పాఠశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ఏర్పా టు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సూచించారు. కలెక్టర్ ఈఆర్‌వోలు, ఏఈఆర్‌ఓలు, ఎంపీఓలు, ఎంఈఓలు, హెడ్మాస్టర్‌లు, కళాశాల ప్రిన్సిపల్స్, ఎన్నికల విభాగం సిబ్బంది, ఆర్‌సిలతో ఓటర్ నమోదు, ఓటు వినియోగం, స్వీప్ ప్రచార కార్యక్రమాలపై కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహి ంచారు. జిల్లాలో 18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని, రానున్న ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తప్పని సరిగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైయివేటు డిగ్రీ, జూనియర్, గురుకుల పాఠశాలల్లో విద్యా ర్థులకు ఓటు హక్కు ప్రాధాన్యత, దాని ఆవశ్యకతపై అవగాహన కలిగించేందుకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు ఇళ్ల వద్ద వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కలిగించేలా ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఓటు హక్కు, ఎథికల్ ఓటింగ్ పై విద్యార్థులతో చర్చా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్ని పాఠశాలలు, కాలేజీల ను సందర్శించి 18 సంవత్సరాలు దాటిన వారందరూ ఓటరుగా నమోదు అయ్యారా లేదా పరిశీలించాలని, కాలేజీలలో ఖచ్చితంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క విద్యార్థి ఓటు హక్కు కలిగివుండేలా చర్యలు తీసుకో వాలని తెలిపారు. 2014 -15 విద్యా సంవత్సరం నుండి 2019-20 వరకు ఎంతమంది విద్యార్థులు పదవ తరగతి పాసయ్యారన్న వివరాలను నివేదికను ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు ఇవ్వాలని సూచించారు. ఆయా వివరాలతో అర్హత గల వారం దరూ ఓటరుగా నమోదు అయింది లేనిది చెక్ చేయాల న్నారు. 18-19 ఏండ్ల వయస్సు వారందరూ ఓటరు జాబితాలో ఉండాలన్నారు.గ్రామ, పట్టణ స్వయం సహాయక మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహి ంచేటప్పుడు తప్ప నిసరిగా ఓటరు నమోదు, ఓటు హక్కును వినియోగించుకోవడం పై చర్చిం చేలా అజెండా పెట్టుకొని అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రతి గ్రామ పంచా యతీలో పంచాయతీ కార్యదర్శి ద్వారా 18 సంవత్స రాలు దాటిన వారందరిని ఓటరుగా నమోదు చేయించేలా చర్యలు చేపట్టాలని డిపిఓ కు సూచించారు. అర్హులు వందకు వంద శాతం ఓటరుగా నమోదు కావాలని, సెప్టెం బర్ 19 వరకు ఓటర్ నమోదుకు అవకాశం ఉందన్నారు. ఫారమ్-6 ద్వారా ఓటరు నమోదు, ఫారమ్ -7 ద్వారా ఓటరు జాబితా నుండి తొలగింపులు, ఫారమ్ -8 ద్వారా మార్పులు చేర్పులు లాంటి విషయాలను ఓటర్లకు అవగా హన కల్పిం చాలన్నారు. వచ్చిన ఆయా ఫారాలు, పరిష్క రించినవి సరి చూసుకోవాలని, తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి సరైన కారణం ఉండాలన్నారు. జాబి తాలో డూప్లికేట్ ఓటర్స్ ఉండొద్దని స్పష్టం చేశారు. ఓటరు జాబి తాలో వీఐపీ ఓటర్స్ మిస్ కాకుండా చూసుకోవాలన్నారు. పిడబ్ల్యుడి ఓటర్లు ఏ ఒక్కరూ మిస్ కావద్దని తెలిపారు. 80 పైబడి వయస్సు గల ఓటర్లను క్రాస్ చెక్ చేసి పరిశీలించాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మాధురి, ఈఆర్వోలు ఏఈ ఆర్వోలు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ రెసిడెన్షి యల్ పాఠశా లల ఆర్ సిఓలు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటే శ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, జిల్లా పంచా యతీ అధి కారి సురేష్ మోహన్, డీఆర్‌డిఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గురువులు నవ సమాజ నిర్మాతలు

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనసత్కారం



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఉపాధ్యాయులే నవ సమాజ నిర్మాతలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో గురు పూజోత్సవం పురస్కరించుకొని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గురువు లేని విద్య గుడ్డి విద్య అని, గురువు లేకుండా ఏ విద్యార్థి రాణిం చలేడన్నారు. సమాజంలో గురువులకు ఉన్న గౌరవ స్థానం ఎవ్వ రికి లేదన్నారు. నాడు ఉన్నత స్థానాల్లో ఉన్న వారు తల్లిదండ్రులకంటే గురువులనే మొదటగా గుర్తించుకుం టున్నారన్నారు. ప్రతి గురువు విద్యార్థులు సన్మార్గంలో నడిపితే వారే సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించను న్నారని తెలిపారు. తాను ఎంపీపీగా ఉన్నప్పటినుండి నేటి వరకు ప్రతి ఏటా గురుపూజ వేడుకలను పండగలా నిర్వహి స్తున్నట్టు తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ అర్హులైన ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యా యులకు వర్తింప చేస్తా మని హామీ ఇచ్చారు. దశాబ్ది కాలంలో తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 200 ప్రైవేటు పాఠశా లల ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సత్కరించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ఉపాధ్యాయుణులు నిర్వ హించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరిం చాయి. ఉపాధ్యాయుల కోసం గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించడం పట్ల ఎమ్మెల్యేను నియోజకవర్గ ప్రైవేటు పాఠశాల సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, వ్యవ సాయ మారె ్కట్ కమిటీ చైర్మెన్ విజయ్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు దశరథ్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ రాఘ వేంద్ర రెడ్డి, మండల విద్యాధికారి పిపి రాథోడ్, మాజీ కార్పొ రేటర్ అంజయ్య, ప్రైవేటు పాఠశాలల సంఘం స్టేట్ వర్కిం గ్ ప్రెసిడెంట్ సాయి తేజ, నియోజకవర్గ అధ్యక్షులు విలియం జేమ్స్, జగన్మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బీసీ రాజకీయ చైతన్య యాత్ర

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ సోషల్ ఫోరమ్(టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 30న సదశివాపేట నుంచి హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వరకు బీసీ రాజకీయ చైతన్య ప్రచార యాత్ర చేస్తున్నట్టు టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన బీసీ లకు 60శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలు మేల్కొని.. రాజ్యం ఏలుకో అనే నినాదంతో ఈ పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రగౌడ్, లింగం, మహిపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తానా అంతర్జాతీయ కవి సమ్మేళనానికి..

ప్రత్యేక ఆహ్వానితులుగా మోటూరి నారాయణరావుకి ఆహ్వానం



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక సెప్టెంబర్ 9వ తేదిన శ్రీ కాళోజీ నారా యణ రావు జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న 'తెలంగాణ భాషా దినోత్సవం' సందర్భంగా జరుగబోతున్న అంతర్జాతీయ కవి సమ్మేళనానికి కవి, తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ కార్యదర్శి, ఎస్‌వీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మోటూరి నారా యణ రావు ప్రత్యేక ఆహ్వాని తులుగా తానా సంస్థ వారు ఆహ్వానించారు. తానా వారు నిర్వహి స్తున్న ఇంతటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమంలో తన కు విశిష్టమైన స్థానాన్ని కల్పించినందుకు తానా అధ్యక్షులు నిరంజన్ శృంగ వరపుకి, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూరకు, సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్‌కు ధన్య వాదాలు తెలియజేశారు. కవి డాక్టర్ మోటూరి నారాయణరావు పలు కవితా సంపు టులు ముద్రించారు. పలురచనలు చేశారు.తెలుగు వెలుగు సాహిత్య వేదిక సంస్థలో ప్రధాన భూమిక పోషిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి గా పని చేస్తూ అనేకమంది ఔత్సాహిక, వర్ధవ ూన కవులను ప్రోత్సహిస్తు న్నారు. ఇటీవలే పటాన్ చెరు నియో జకవ ర్గంలో ఎమ్మెల్యే గూడెం మహి పాల్ రెడ్డి సహకారంతో వెయ్యి మంది కవు లతో జాతీయ సాహి త్య సంబు రాల ను విజయవ ంతంగా నిర్వహించి సాహి త్య లోకాన్ని ఆకర్షిం చా రు. అంతర్జాలంలో తానా నిర్వహి స్తున్న ఈ భాషా దినో త్సవం కార్యక్రమం యప్ టీవీ ద్వారా అనేక యూరప్ దేశా ల్లో ప్రత్యక్ష ప్రసారం అవటమే కాకుండా, తానా అధికారిక యూట్యూబ్ ఫేస్ బుక్ చానల్స్ లో, ఈటీ వీ భారత్ వంటి దాదాపు పది యూట్యూబ్ ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసా రం కా నుంది. డాక్టర్ మోటూరి నారాయణ రావుకు అంత ర్జాతీ య గుర్తింపు రావడం పట్ల పలువురు పెద్దలు, రాజకీ య నాయకులు, మిత్రులు,కవి పండితులు హర్షం వ్యక్తం చేశారు.



కమ్యూనిటీ హాల్ స్థలం విషయంలో ఇబ్బందులు

నవతెలంగాణ-జహీరాబాద్

జంగమ సమాజానికి కమిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించిన స్థల విషయంలో కొందరు తీవ్ర ఇబ్బందుల గురి చేస్తున్నారని జంగమ సమాజం అధ్యక్షులు శివకుమార్ స్వామి అన్నారు. ఈ విషయమై ఆర్డీవో ఆఫీస్‌లో బుధవారం జరిగిన సమావేశంలో.. సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని.. మీరు ధైర్యంగా పనులు ప్రారంభించుకోండి అని అధికారులు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర జంగమ సమాజం కార్య నిర్వహక కార్యదర్శి మఠపతి నాగయ్య స్వామి, మాజీ పట్టణ అధ్యక్షులు ఉడు మునేల్లి విరయ్య స్వామి, రాజు స్వామి, బక్కయ్య స్వామి, మఠం మల్లికార్జున్ స్వామి, శ్రీశైలం స్వామి, బిచ్చయ్య స్వామి, చంద్రశేఖర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుని జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవ తెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ మండలం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలకు అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరై మాట్లాడారు. అవినాష్ కుమార్ కొద్దికాలంలోనే క్రియాశీల రాజకీయాల్లో పాలుపంచుకొని పార్టీ అభివృద్ధికి పాటుపడు తున్నారని గుర్తు చేశారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కృషివలుడని కొనియాడారు. కలుపుగోలుతనంతో ప్రజల మనసులను ఆకట్టుకొని నిరంతరం ప్రజల్లో ఉండే మనిషి అవినాష్ కుమార్ అని గుర్తు చేశారు. ఇలాంటి వ్యక్తులు పార్టీకి ప్రజలకు ఎంతో అవసరమన్నారు. ఈయన సేవలు పార్టీ గుర్తించి సేవలు తీసుకుంటుందన్నారు. పార్టీ కార్యకర్తలకు ఆపద వచ్చిన అర్ధరాత్రి సమయంలో స్పందించే గుణం అవినాష్‌కు ఉందన్నారు ఇలాంటి నాయకుడికే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప శేఖర్ రెడ్డి, పాల్వంచ సర్పంచ్ శివకుమార్, మాసంపల్లి నారాయణ జోగిపేట్ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, లో ఉన్నారు.

కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-నార్సింగి

గత నాలుగు రోజులుగా మండలంలో భారీగా కురుస్తూ, బుధవారం పగటి పూట కాస్త తెరిపినిచ్చినా, వాతావరణ శాఖ మరో మూడు రోజులు భారీగా వర్షాలు ఉన్నాయని హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నార్సింగి ఎంపిపి చిందం సబిత రవీందర్ కోరారు. విలేకరులతో సబిత మాట్లాడుతూ భారీగా కురుస్తున్న వర్షాల వల్ల ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి గ్రామం నుంచి పంచాయితీ కార్యదర్శుల ద్వారా చెరువులలో నీటి నిల్వలు, చెరువు కట్టల పరిస్థితి, వాగుల ప్రవాహంపై ఎప్పటి కప్పుడు సమాచారం తెలుసుకుంటున్నామన్నారు. ప్రస్తుతానికి ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. చెరువులు అలుగులు పారుతున్న నేపథ్యంలో వాగులలో నీరు ఉద్రుతిగా ప్రవహిస్తూ ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రైతన్నలు పొలాలకు వెళ్ళినప్పుడు విష పురుగులు, పాముల నుంచి అప్రమత్తంగా ఉండాలని, బోరు మోటర్లు వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. మండల ప్రజలు ఏమైనా సమస్యలుంటే తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మర్కుక్ మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులుగా మండలంలోని చేబర్తి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎం.డి షాభోద్దీన్ , పాములపర్తి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎం.డి అమీర్ షరీఫ్ , ప్రాథమికోన్నత ఎర్రవల్లి లో పనిచేస్తున్న టి. కుమార్, ప్రాథమిక పాఠశాల పాములపర్తి లో పనిచేస్తున్న టి.జైపాల్ రెడ్డి,ఎంపికైన విషయం తెలిసిందే. మంగళవారం టిటిసి భవనములో జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజాశర్మ,డీఈవో శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు.అనంతరం వారిని సన్మానించి, ప్రసంశ పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఎంఈవోలు ఉదయ భాస్కర్ రెడ్డి ,యాదవ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి ,ఉపాధ్యాయులు సుగుణాకర్, వివిధ యూనియన్ల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శశిధర్ శర్మ ఇంద్రసేనారెడ్డి లు ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ శ్రీనివాస్ చారి ,సురేందర్ రెడ్డి , ఉపాధ్యాయులు తదితరులున్నారు.

అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

మద్దూరు ఎంపీపీ బద్దిపడ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-మద్దూరు

అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతోనే పనిచేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమని మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలకు తీర్మానం చేయాలని అధికారులను ఆదేశించారు. మూడు మండలాలలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఏపిఎం బాబురావును తమ మద్దూరు మండలంలో ఏపిఎంగా కొనసాగించవద్దని సభ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. అధికారులు ప్రజలకు సేవలు చేసి మన్ననలు పొందాలని ఆయన కోరారు. అంతకుముందు వివిధ శాఖలపై సర్వసభ్య సమావేశంలో అధికారులకు ప్రజాప్రతినిధులకు వాడేవిగా చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు అనంతరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, రేబర్తి పిఎసిఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఆకుల యాదగిరి, ఎంపీటీసీలు గుజ్జుక సమ్మయ్య, నందన బోయిన నర్సింలు, గుల్ల సత్య కళ, బొప్పా కనకమ్మ, సర్పంచులు జనార్దన్ రెడ్డి, రవీందర్ రెడ్డి,



అంజయ్య, కూకట్ల బాలరాజు, ఎంఈఓ మొగుళ్ల నరసింహారెడ్డి, విద్యుత్ శాఖ ఏఈలు సుధీర్ బాబు, శ్రీనివాసరావు, పిఆర్ ఏఈ వినయ్ కుమార్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మి డాక్టర్ స్టువర్సన్, అంగన్వాడి సూపర్వైజర్ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కోసం కరపత్రాల పంపిణీ



నవతెలంగాణ-దుబ్బాక

అన్ని అర్హతలున్న దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని దుబ్బాక డెవలప్మెంట్ ఫోరం (డిడిఎఫ్) అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్ అన్నారు. రెవెన్యూ డివిజన్ ఆవశ్యకతను వివరిస్తూ డిడిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో ఇంటింటికి కరకత్రాలను పంపిణీ చేశారు. అందులో భాగంగా మొదట సీఎం కేసీఆర్ గురువు గన్నె బాల్ రెడ్డి చేతుల మీదుగా ఈ కరపత్రాలను ఆవిష్కరించారు. రెవిన్యూ డివిజన్ ఏర్పాటుతోనే దుబ్బాక నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష నాయకులు దుబ్బాక రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కోసం కృషి చేయాలని కోరారు. డిడిఎఫ్ జేఏసీ ప్రతినిధులు రేపాక భాను, చింత సంతోష్, రాజేష్, కడవేర్గు రాజేందర్, నాగరాజు, ప్రేమ్ ఉన్నారు.

ఘనంగా జర్నలిస్ట్ డే



నవ తెలంగాణ-సిద్దిపేట

శ్రీ సంతోషిమాత దేవాలయంలో ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో జర్నలిస్ట్ డే సందర్భంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులను సన్మానించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు. అంతకుముందు వేద బ్రాహ్మణులైన అర్చకులు పొడిచేటి రామకృష్ణ వారి పరివార అర్చకులతో గోత్రనామార్చనలతో, అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో విలేకరి పాత్ర ఎంతో కీలకమైనదని, ఎలాంటి సందర్భాల్లో నైనా వారు త్యాగశీలులుగా ముందుకు వచ్చి వార్తలు సేకరించి ప్రజలకు తెలియజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం ధర్మకర్తలు గాదగొని సత్యం గౌడ్, చకిలం అమర్నాథ్, కాముని ప్రభాకర్, కొమరవెళ్ళి కళ్యాణి, గరిపల్లి సువర్ణ, యెక్స్ అఫిషియో సభ్యుడు శాకం మధుసూధన్ రావు, కార్యనిర్వహణ అధికారి పి. విశ్వనాథ్ శర్మ మాజీ చైర్మెన్‌లు కాచం కాశీనాథ్, సిబ్బంది శంకర్, వాసు, సహా అర్చకులు సాయి కృష్ణ, బావయ్య పాల్గొన్నారు.

భగవత్ గీత సృష్టికర్త శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు

ప్రఖ్యాత చిత్రకారులు రుస్తుం

నవ తెలంగాణ- సిద్దిపేట

శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగను పురస్కరించుకుని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో బుధవారం "కృష్ణాష్టమి" క్యాన్వాస్ చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. అందరికి శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు సంస్కృతి సంప్రదాయాలను కళావంతం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీంరుస్తుం, గ్రిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రూబీనారుస్తుం, మొహ్మద్ సాధిక్, ఎండి రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలో చిన్నారులు

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

శ్రీకృష్ణ జన్మదిన సందర్భంగా కృష్ణాష్టమి వేడుకలను సెయింట్ మేరీస్ విద్యానికేతన్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. బుధవారం శ్రీకృష్ణుని వేషధారణతో చిన్నారులు వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కాటారాయప్ప మాట్లాడుతూ శ్రీ కృష్ణుడి పేరు వినగానే భగవద్గీతనే గుర్తొస్తుందన్నారు. భగవద్గీతను బోధించడానికి శ్రీకృష్ణుడు లోకానికి దారి చూపాడని చిన్నతనంలో అల్లరి బాలుడుగా ఉండేవాడన్నారు. చిలిపి చేష్టలతో చిన్నతనంలోనే వెన్న దొంగగా మారి అందరి మనసులను దోచుకున్నాడని పేర్కొన్నారు. గోకులంలో పాలకునిగా యశోద పుత్రునిగా బలరాముని సోదరుడిగా ఉన్నారన్నారు. ధర్మ సంరక్షకుడిగా ఎన్నో పాత్రలు పోషించాడని జీవిత పరమార్ధాన్ని సైతం మనందరికీ తెలియజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి భాగ్యలక్ష్మి ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

దళిత బందు పథకం ఎంపిక సరిగ్గా లేదని ఆందోళన



నవ తెలంగాణ-కొమురవెల్లి

మండలంలోని మర్రి ముచ్చాల గ్రామంలో దళిత బంధు పథకం దొంగ చాటుగా ఎంపిక చేస్తున్నారని దళిత కుటుంబాల మహిళలు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు బుధవారం ఆందోళన చేపట్టారు. దళిత బంధు పథకం కింద అర్హులను గ్రామసభ ఏర్పాటు చేసి ఎంపిక చేయాలని సర్పంచ్‌ను నిలదీశారు. నచ్చిన వాళ్లను దళిత బంధు పథకానికి ఎంపిక చేస్తున్నారని అదే జరిగితే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సర్పంచ్ మాట్లాడుతూ దళిత బంధు పథకానికి ఎవరిని ఎంపిక చేయలేదని గ్రామసభ నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

దూల్మిట్ట కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేరాలని ప్రచారం

నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 6,7 తరగతిలో చేరాలని ఎస్ఓ స్వప్న విద్యార్థుల ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం కస్తూర్బా గాంధీ పాఠశాలను మంజూరు చేసిందని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేర్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోతరాజు మధు గ్రామస్తులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వాటర్ బాటిల్ బ్యాగ్స్ అందజేత

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

ఉపాధి కూలీలకు మంత్రి హరీష్ రావు చొరవతో వచ్చిన స్టీల్ వాటర్ బాటిల్, టిఫిన్ బాక్స్, బ్యాగును సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో బుధవారం ప్రజాప్రతినిధులు అధికారులు కూలీలకు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ తన్నీరు రేణుక శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి కూలీలను మరింత ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదన్న ఉద్దేశంతో కూలీలకు స్టీల్ టిఫిన్ బాక్స్ స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేసినట్లు తెలిపారు. త్వరలో గ్రామంలో పూర్తి ప్లాస్టిక్ రహితంగా చేసి ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మమతా యాదగిరి, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ఉపాధి హామీ కూలి మేటి వెంకటేశం, స్థానిక బీఆర్ఎస్ నాయకులు సంపత్ యాదవ్, కరోబార్‌లు మహిపాల్, యాదగిరి ఉపాధి హామీ సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.

సీఐ ఎస్ఎఫ్ ఉద్యోగాన్ని సాధించిన దొమ్మాట విద్యార్థి

నవ తెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన కరికే అఖిల్ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) ఉద్యోగాన్ని సాధించారు. కరికే లక్ష్మి నర్సింగరావు దంపతుల రెండవ కుమారుడు కరికే అఖిల్ తల్లి లక్ష్మి, చిన్నాన్న మాజీ సర్పంచ్ కరికే శంకర్ సాకారంతో సిద్దిపేటలో డిగ్రీ పూర్తి చేసి ఇటీవల కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో రాత పరీక్షలు రాసి ఉద్యోగానికి ఎంపికయ్యారు. దొమ్మాట గ్రామంలోనే ఉద్యోగం ప్రథమంగా సాధించారని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమపై అవిశ్వాసం



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల పరిషత్ వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమపై అవిశ్వాసం పెడుతున్నట్లు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఆకుల యాదగిరి, ఎంపీటీసీలు గుజ్జుక సమ్మయ్య, నందన బోయిన నరసింహులు, గూల్ల సత్య కళ, బొప్పా కనకమ్మలు ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్ కు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేశారు

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఓ పేదింటి ఆడబిడ్డ వివాహానికి గజ్వేల్ జగదేవపూర్ మండల రజక సంఘము నాయకులు పెళ్లి వస్తువులు ఆర్థిక సహాయం చేసారు. బుధవారం కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామానికి చెందిన ఓ పేదింటి పెళ్లి కూతురు వివాహానికి ఆర్థిక సహాయం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుద్దెడ గ్రామానికి చెందిన బస్వరాజు యాదగిరి-లక్ష్మీ నర్సవ్వల కూతురు రేణుక పెళ్లి కి సహాయం చేశామన్నారు. రూ.40 వేలు విలువైన బీరువ, మంచం, డ్రెస్సింగ్ టేబుల్, రెండు కుర్చీలు పెళ్లి కూతురు తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగదేవ్ పూర్ మండల రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్, గజ్వేల్ మండలం ప్రెజ్ఞాపూర్ గ్రామానికి చెందిన రజక సంఘం నాయకులు మెతుకు నర్సింలు, జగదేవపూర్ మండల రజక సంఘం గౌరవ అధ్యక్షులు అక్కారం నరసింహులు, రిటైర్డ్ ఆర్ టిసి డ్రైవర్ రాములు, మహిళా కానిస్టేబుల్ వీణ పాల్గొన్నారు.